

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



స్వాగతం.. సుస్వాగతం..



అనంతసాగరంలో పేరెంట్స్‌కు పువ్వులు ఇచ్చి ఆహ్వానిస్తున్న విద్యార్థులు



గట్టిగా లాగు.. సంగంలో విద్యార్థుల తండ్రులకు టగ్ ఆఫ్ వార్..



మనుబోలులో తల్లులకు కుర్చీలాట

బడి బాగుందా!?



ఉలవపాడులో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

ప్రధాన ముఖద్వారాలకు కట్టిన అరటి చెట్లు... మామిడి తోరణాలు.. వివిధ రకాల పూలతో అలంకరణ.. ఎంతో అందంగా రూపుదిద్దుకున్న వేదికలు.. షామియానాల కింద కుర్చీలు అచ్చం కల్యాణమండపాల్లా ప్రభుత్వ విద్యాసంస్థలు శోభిల్లాయి. శనివారం పేరెంట్స్-టీచర్స్ మీటింగ్స్ (పీటీఎం) జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో పండుగ వాతావరణంలా సాగాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు తరలివచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించారు. విద్యా బోధన మెరుగుదల, పాఠశాలల అభివృద్ధిపై సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి, పిల్లల ప్రగతి నివేదికలను తల్లిదండ్రులకు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ రకాల వంటకాలతో సహపంక్తి భోజనాలతో పీటీఎంలను ఉత్సాహంగా ముగించారు.

అంబరాన్నంటిన సంబరం

• ప్రభుత్వ బడుల్లో పండగ వాతావరణం • అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం • మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ విజయవంతం

జిల్లావ్యాప్తంగా జరిగిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పట్లో తమకు ఎదురైన తీపి గుర్తులు, చేదు అనుభవాలను విద్యార్థుల తల్లిదండ్రులతో పంచుకున్నారు.

చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని..

ప్రభుత్వ బడిలోనే చదివా..

ప్రభుత్వ పాఠశాలలో చదివిన నేను ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నాను. మీరు కూడా బాగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించండి. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల కంటే నాణ్యమైన విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల ద్వారానే లభిస్తుంది. ప్రైవేటు పాఠశాలల్లో ఇంటర్ చదివిన వారు కూడా పాఠాలు బోధిస్తున్నారు. మన ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని విధాలా క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారు.

- ఆత్మకూరులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

టెన్త్ ఫెయిల్ అయినా..

'నేనూ తొలుత టెన్త్‌లో ఫెయిల్ అయ్యాను. ఆ తర్వాత గ్రేస్ మార్కులతో పాస్ అయ్యా. ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహంతోనే డిగ్రీ, పీజీలలో బంగారు పతకాలు సాధించాను. తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థి అధైర్యపడకుండా పట్టుదలతో ముమ్మందు విజయాలను సాధించవచ్చు.'

- నెల్లూరులో మంత్రి పొంగూరు నారాయణ

కష్టాలు పంచుకున్న బుచ్చి తహసీల్దారు

బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి హైస్కూల్లో జరిగిన సమావేశంలో బుచ్చి తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు తన వ్యక్తిగత జీవితం గురించి వివరించారు. పేద కుటుంబంలో పుట్టడం, ఉన్నత చదువులకు వెళ్లలేకపోవడం, గేదెలు కాస్తూ.. వ్యవసాయం చేస్తూ ఉన్నత విద్య అభ్యసించినట్లు తెలిపారు. ఉత్తమ విద్యార్థిగా ఎదిగి ఉద్యోగం సాధించేవరకు తానుపడిన కష్టాలను విద్యార్థులతో పంచుకోవడం అందరికీ స్ఫూర్తినిచ్చింది.

నెల్లూరు(విద్య), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడంతోపాటు సహృద్భావ వాతావరణం కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ పాఠశాలల్లో శనివారం నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. పాఠశాలల్లో ఉత్తమ విద్య అందించేందుకు, అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిపి కలిపి ఒకే వేదికపైకి చేర్చడంతో ప్రభుత్వ బడుల్లో పండగ వాతావరణం నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారుల కలిసి తల్లిదండ్రులతో విద్యాపరమైన అంశాలు చర్చించడంతో పాటు ఆటపాటలు, శుభతిథి పేరుతో సహపంక్తి భోజనాలు చేసి పిల్లల ప్రగతి నివేదికలు అందచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శుభతిథి పేరుతో శనివారం జిల్లాలోని 2,601 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి.

• రాష్ట్ర చరిత్రలో గర్వకారణం : మంత్రి నారాయణ

రాష్ట్ర చరిత్రతలో ఒకేరోజున, ఒకే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించడం గర్వకారణమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని నవాబుపేట బీవీఎస్ బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమష్టి ప్రోత్సాహంతోనే విద్యార్థుల శక్తియుక్తులు ద్విగుణీకృతమవుతాయన్నారు. విద్యార్థులకు మార్కులు ప్రామాణికం కాదని, ఎక్కువ వచ్చిన వారిని పొగడటం, తక్కువ వచ్చిన వారిని దండించడం సరికాదన్నారు. ఉపాధ్యాయులతో చర్చించి విద్యార్థుల బలహీనతలను గుర్తించి ప్రోత్సహిస్తే ఉన్నతంగా ఎదుగుతారన్నారు. అనంతరం సౌత్‌ఏషియన్ ఆట్యాపాట్యా పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారిణి పూజితను సన్మానించి అభినందించారు. ఈ సమావేశంలో డీఈఓ బాలాజీరావు, హెచ్‌ఎం విజయజ్యోతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

• సంతోషంగా ఉంది : ఎంపీ వేమిరెడ్డి

పార్లమెంట్‌లో ఎంపీలతో ఉండటం కంటే విద్యార్థులతో గడపడం తనకెంతో సంతోషం కలిగిస్తోందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నగరంలోని కేఎస్ఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్, టీచర్స్ సమావేశంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఇంటివద్ద తల్లిదండ్రులు పిల్లల చదువు బాధ్యతను తీసుకుంటే ఉన్నతంగా ఎదుగుతారన్నారు. తాము కూడా పాఠశాల అభివృద్ధికి పూర్తి సహాయ, సహకారాలు అందచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లూరులో విద్యార్థులతో మంత్రి నారాయణ



నెల్లూరు : విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తదితరులు



నెల్లూరు : సరస్వతి విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ ఆనంద్

• సమన్వయంతోనే అభివృద్ధి: కలెక్టర్

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతోనే పాఠశాలల అభివృద్ధి, విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరినీ గమనించడం సాధ్యం కాదని, ఇంటి వద్ద తల్లిదండ్రులు కూడా ప్రతిరోజు కొద్దిసేపు పిల్లలతో ముచ్చటించి విద్యాపరమైన అంశాలతోపాటు ఇతర అంశాలను కూడా చర్చించాలన్నారు. అనంతరం తల్లిదండ్రులు సమావేశమైన తరగతి గదుల్లోకి వెళ్లి కొద్దిసేపు ముచ్చటించారు. అలాగే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ భార్గవితో పాఠశాల అవసరాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ బాలాజీరావు, ఎంఈఓ మురళీధర్, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, పూర్వ విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

• తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలి : ఆర్ఐవో

తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా ఉంటూ పిల్లల విద్య, ప్రవర్తనపై దృష్టి సారించాలని ఆర్ఐఓ డాక్టర్ ఎ.శ్రీనివాసులు అన్నారు. నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను క్వశ్చన్ బ్యాంకు విధానం ద్వారా ఉత్తీర్ణులయ్యేలా చేస్తామన్నారు. అనంతరం పలు అంశాలపై తల్లిదండ్రులతో మాట్లాడి వారి సూచనలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



సంగంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



విద్యార్థినితో మాట్లాడుతున్న మంత్రి ఆనం

గురుకుల పాఠశాలకు వరాలు

ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి): బాలికల గురుకుల పాఠశాలకు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వరాలు కురిపించారు. శనివారం జరిగిన పీటీఎం సమావేశంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల విన్నపాల పట్ల సానుకూలంగా స్పందించి పాఠశాలకు వరాలజల్లు కురిపించారు. తన హయాంలో ఏర్పాటైన ఆత్మకూరు గురుకుల పాఠశాలను ఇంటర్మీడియట్ వరకు స్థాయిని పెంచేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. అదేవిధంగా ప్రహరీ గోడను వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయిస్తానని, తాగునీటి సమస్య తీర్చేందుకు మినరల్ వాటర్ ప్లాంట్‌ను దాతల సాయంతో ఏర్పాటు చేస్తామన్నారు. గురుకులంలో చదవుల తల్లి సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటుతోపాటు 15 కంప్యూటర్లను అందిస్తానన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వేచి ఉండేందుకు వెయిటింగ్ హాలు, టాయిలెట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. డంపింగ్ యార్డ్‌ను ఇక్కడి నుంచి తరలించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనరును ఆదేశించారు.

'సోమశిల'లో 73.6 టీఎంసీల నీరు

అనంతసాగరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 13,407 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో డ్యాంలో 73.644 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కండలేరుకు 2,000, ఉత్తర కాలువకు 40, దక్షిణ కాలువకు 150, డెల్టాకు 2,450 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రాళ్లపాడులో 19.10 అడుగులకు..

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 19.10 అడుగులకు చేరింది. మరో 2 అంగుళాల మేర నీరు చేరితే ప్రాజెక్టులో పూర్తి నీటినిల్వ సామర్థ్యమైన 20 అడుగలకు చేరుతుందని ప్రాజెక్టు డీఈ ఎం వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రస్తుతం 200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఒకవేళ ప్రాజెక్టు ఎగువన వర్షాలు కురిసి వరద వస్తే ప్రాజెక్టు వద్ద తనతో పాటు డీఈ మధుసూదనరావు, ఏఈలు, అప్రమత్తంగా ఉంటున్నట్లు పేర్కొన్నారు.

• 'గండిపాళెం'లో 19 అడుగులకు...

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): గండిపాళెం జలాశయ నీటిమట్టం 19 అడుగులకు చేరింది. పైతట్టు ప్రాంతాల నుంచి 600 క్యూసెక్కుల వరద డ్యాంలోకి వచ్చి చేరుతోంది.



రాళ్లపాడు ప్రాజెక్టు

పొదుపు మహిళల్లో అక్షర వెలుగులు

• 'ఉల్లాస్' కార్యక్రమం ద్వారా ఎనిమిది అంశాలపై బోధన
• తొలివిడతగా 24 వేల మంది ఎంపిక
• పది మందికి ఒక వలంటీరు నియామకం
• డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో రాత్రి పూట చదువు

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యులైన పొదుపు సంఘాల మహిళలను అక్షరాస్యులుగా మార్చడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ అల్ ఇన్ సొసైటీ) కార్యక్రమం ద్వారా జిల్లాలో పొదుపు మహిళలకు సామాజిక, ఆర్థిక, డిజిటల్ తదితర అంశాలపై అక్షరాస్యతా తరగతులు నిర్వహించనున్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మూడేళ్లపాటు కొనసాగే ఈ కార్యక్రమంలో ప్రతి ఆరు నెలలకు ఒక బృందానికి పాఠాలు బోధిస్తారు. ఆరు నెలల వ్యవధిలో 200 గంటలపాటు అభ్యసన తరగతులు ఉంటాయి. ప్రతి పది మందికి ఒక వలంటీరును ఎంపిక చేశారు. వీరిలో స్వచ్ఛందంగా బోధనకు వచ్చే నిరుద్యోగులతో పాటు పొదుపు సంఘాల్లో చదువుకున్న మహిళలు, వీఓఏలు ఉంటారు.

• 24 వేల మంది

జిల్లాలో 39,509 పొదుపు సంఘాలు ఉండగా, ఒక్కో గ్రూపులో 10 మంది సభ్యుల వంతున 3,95,090 మంది మహిళలు ఉన్నారు. వీరిలో తొలి విడత బోధనకు జిల్లాలో 24 వేల మందిని ఎంపిక చేశారు. ప్రతి 10 మందికి ఒక వలంటీర్ లెక్కన ఎంపిక చేసి చదువు చెప్పించను న్నారు. పొదుపు సంఘాల మహిళలతోపాటు అంగన్ వాడీ కేంద్రాల్లోని ఆయాలు, ప్రభుత్వ పాఠశాలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో పనిచేస్తు న్న ఆయాలు, సహాయకులు, వంట పనివారు, వాచ్‌మెన్ తదితర నిరక్షరాస్యులను ఎంపిక చేసి తరగతులు ప్రాంభించనున్నారు. ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు పాఠ్యాంశ బోధన ఉంటుంది. శిక్షణ అనంతరం వీరికి పరీక్షలు నిర్వహిస్తారు. .

ఎనిమిది అంశాలు

- మన ఆచార వ్యవహారాలు
- పరిశుభ్రత-ఆరోగ్యం
- ఎన్నికలు
- కుటుంబం ఇరుగు పొరుగు
- పిల్లల పెంపకం-మన బాధ్యత
- చట్టాలు తెలుసుకుందాం
- మా ఇంటి మహాలక్ష్మి, డిజిటల్ అక్షరాస్యత తదితర అంశాలపై తెలుగు భాష, గణితం పాఠ్యాంశాలు ఉంటాయి. దైనందిన వినియోగానికి సంబంధించిన నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో పాఠ్యపుస్తకాన్ని రూపొందించారు.

తెలుగు భాషపై పట్టు



ఉల్లాస్ కార్యక్రమం ద్వారా తెలుగుభాషపై మంచి పట్టు వచ్చేలా పొదుపు మహిళలకు పాఠ్యాంశ బోధన చేయిస్తాం. బ్యాంకులకు సంబంధించి డిజిటల్ లావాదేవీల గురించి బోధన ఉంటుంది. పొదుపు సంఘాల్లో మహిళలందరినీ అక్షరాస్యులుగా మార్చేందుకు అన్నీ చర్యలు చేపట్టాం. పాఠ్యపుస్తకాలు అందిన వెంటనే బోధనా తరగతులు ప్రారంభిస్తాం.

- నాగరాజకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ



పొదుపు సంఘం మహిళలు

'ఎగ్'బాకుతోంది!

• రూ.7లకు చేరిన గుడ్డు ధర

కోడి గుడ్డు ధర కొండెక్కింది. వేసవిలో ఎండ తీవ్రతతో ధరలు తగ్గినా.. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు తగ్గి వర్షాలు పడటంతో రోజువారి ఉత్పత్తి క్రమేణా తగ్గుతోంది. దీంతో డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం హోల్‌సేల్‌గా గుడ్డు ధర రూ.6.20 ఉండగా, ప్రజలకు మాత్రం రూ.7లకు విక్రయిస్తున్నారు. ఇంతధర గతంలో ఎప్పుడూ నమోదు కాలేదని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. గత వేసవిలో 20 శాతం వరకు ఉత్పత్తి పడిపోగా లక్షల కోళ్లు బడ్ ఫ్లూ లక్షణాలతో జిల్లాలో మృత్యువాతపడ్డాయి. ఇదిలా ఉంటే కోళ్ల మేతగా వినియోగించే మొక్కజొన్న టన్ను రూ.22వేల నుంచి 24వేలు, నూకలు రూ.18వేలు నుంచి 22వేల చొప్పున పెరిగాయి. ఇలా ఉత్పత్తి తగ్గడం, మేత ధరలు పెరగడం తదితర కారణాల దృష్ట్యా గుడ్ల ధర పెరిగినట్టు సమాచారం.

- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)






ఇందుకూరుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఎరుపెక్కిన ఇందుకూరుపేట

ఇందుకూరుపేటలో శనివారం సీపీఎం 25వ జిల్లా మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి షాదీమంజిల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభావేదిక వరకు సీపీఎం నేతలు, ఆటో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీతో పట్టణమంతా ఎరుపెక్కింది. సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తదతర ప్రముఖులు ఈ సభలో పాల్గొన్నారు.

- వివరాలు 6లో

కమ్మేసిన మంచు


ఉలవపాడులో లైట్ల వెలుగుల్లో వాహనాల రాకపోకలు


కావలిలో పొలాలను కమ్మేసిన పొగమంచు


కావలి రైల్వేస్టేషనులో..

జిల్లాను పొగ మంచు కమ్మేసింది. ఉదయం 8 గంటల తర్వాత కూడా మంచు కురుస్తుండటంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. ఇటీవల 'ఫెంగల్' తుఫాన్ ప్రభావంతో వారం రోజుల పాటు భారీ వర్షాలు కురిశాయి. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా రెండురోజులుగా మంచు కురుస్తోంది. కావలి శివార్లలోని చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి పై దట్టమైన పొగమంచు కారణంగా వాహన రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. మంచు కారణంగా రోడ్డు కనిపించక పోవటంతో చాలాచోట్ల వాహనాలను మార్జిన్, దాబా హోటళ్లు, విశ్రాంతి ప్రదేశాలలో ఇండికేటర్లు వేసి ఆపేశారు. మరోవైపు పల్లెల్లో ఆహ్లాద వాతావరణం కనిపించింది. కొన్ని ప్రాంతాల్లో చలితీవ్రత ఉండటంతో వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడ్డారు.

- కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి)


బుచ్చిరెడ్డిపాలెం: జొన్నవాడలో మంచు పరదా..

ఈ దారిలో వెళ్లేదెలా...



అనంతసాగరం చెరువు మొదటి తూము పరిధిలోని కాలువ కల్వర్టు, రహదారి అధ్వానంగా మారింది. గత కొంత కాలంగా కల్వర్టుకు ఇరువైపులా గోడ నిర్మాణం చేయక వేసిన మట్టి కరిగిపోతూ కల్వర్టు మనగడ ప్రశ్నార్థకంగా తయారై, రోడ్డు అధ్వానంగా మారినట్లు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వరిసాగు పనులు జోరుగా సాగుతున్నాయి. అయితే బురదగా ఉన్న రోడ్డులో వరినారు, ఎరువులు పొలాల్లోకి తీసుకెళ్లాలంటే నరకప్రాయంగా ఉందని ఇకనైన అధికారులు చొరవ చూపి పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

ఆదమరిస్తే అంతేసంగతులు...



ఉదయగిరి పట్టణంలోని నాగులబావి వీధిలో ఇటీవల కురిసిన వర్షాలకు సిమెంట్ రోడ్డు మార్జిన్ కోతకు గురైంది. దీంతోపాటు రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలు పూడ్చి మార్జిన్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి):

అధ్వానంగా పెరమన రహదారి



సంగం - ఆత్మకూరు రహదారి నుంచి పెరమన గ్రామానికి వెళ్లే రహదారి గుంతలమయమై అధ్వానంగా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వంలో రహదారుల మరమ్మతులకు నిధులు విడుదల చేయకపోవడంతో వాహన రాకపోకలతో భారీ గుంతలు ఏర్పడి వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. సుమారు అరకిలోమీటరు దూరం ప్రయాణం నరకంగా మారింది. గుంతల్లో నీళ్లు నిలిచి ప్రమాదకరంగా మారిందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

కమ్మని 'కర్రీస్'

- నగరం, పట్టణాలలో వెలుస్తున్న కేంద్రాలు
- ఉద్యోగులు, విద్యార్థులకు ఇవే ఆధారం
- అత్యవసర సమయంలో ఆకలి తీరుస్తున్న కర్రీస్ పాయింట్లు

ఏమండీ.. ఈరోజు నేను ఇంట్లో కూరేమి చేయలేను.. వచ్చేటప్పుడు బయట కర్రీస్ తీసుకురండి!

నాన్న రేపు మాకు సెలవు. కాబట్టి మొన్న తీసుకువచ్చావే ఆ కర్రీస్ పాయింట్లో నాకిష్టమైన చికెన్ ఫ్రై తీసుకురావా!?

స్వాతీ.. నేను ఫ్రెండ్స్‌తో ట్రిప్‌నకు వెళ్తున్నా సో.. కూరగాయలు తీసుకురాలేను ఈ నాలుగు రోజులు అన్నం వండేసుకుని బయట్నుంచి కర్రీస్ తెచ్చేసుకో!

రేయ్.. నాకు క్లాస్‌లేదు. రూమ్‌కు వెళ్లిపోతా. కరెంటు కుక్కర్‌లో రైస్ పెట్టేస్తాను. వచ్చేటప్పుడు కర్రీస్ తీసుకువచ్చేయ్.

ఇదండీ వరస. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగం చేస్తున్న రోజులివి. పొద్దున్నే ఆఫీస్‌కు వెళితే ఏ రాత్రికో తిరిగి ఇంటికి చేరుతారు. ఇంట్లో కనీసం వంట చేసుకునే సమయం కూడా ఉండదు. పల్లె ప్రాంతాల నుంచి నగరం, పట్టణాలకు వచ్చి అద్దె గదులలో ఉంటున్న విద్యార్థుల పరిస్థితీ అంతే. వీరందరి కోసమే అన్నట్టుగా కర్రీస్ పాయింట్లు వెలిశాయి. డిమాండ్ దృష్ట్యా కొన్నిచోట్ల హోటళ్ల నిర్వాహకులు కూడా కూరలను విక్రయిస్తున్నారు.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)

చట్నీ, తాలింపుల దగ్గర నుంచి సాంబారు, పప్పు, రసం, వడపులుసు, ఇక నాన్‌వెజ్‌లో చికెన్ ఫ్రై, మటన్ ఫ్రై, తలకాయకూర, చేపల ఫ్రై, పులుసు, రొయ్యల ఫ్రై, పక్కీల (చిన్నచేపలు) పులుసు, బోటీ, వంటి రుచికరమైన వంటలు ఇప్పుడు సాధారణ కర్రీస్ పాయింట్లలోనూ లభ్యమవుతున్నాయి. ఒకప్పుడు పప్పు, సాంబారు, రసం మాత్రమే ఈ పాయింట్లలో దొరికేవి. కర్రీస్ పాయింట్లపై ప్రజల ఆధారణ పెరుగుతుండటంతో వాటి నిర్వాహకులు కూడా వెజ్, నాన్‌వెజ్‌లతోపాటు రాగిసంగటి వంటి ప్రత్యేక వంటకాలను అందుబాటులోకి తెస్తున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కర్రీస్ దొరుకుతున్నాయి. నిరుపేదల నుంచి సంపన్న కుటుంబాల వరకు నేటి సమాజంలో కర్రీస్ పాయింట్లపై ఆధార పడాల్సిన స్థితి ఏర్పడింది. దినసరి కూలీలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇలా అన్ని రంగాల ప్రజలు కర్రీస్‌లను బయట నుంచి తీసుకెళ్లి ఆకలి తీర్చుకుంటున్నారు. ఇంట్లో అన్నం వరకు వండుకుని కూరలను సెంటర్లలో పట్టుకెళ్తున్నారు.





ధరలూ అనుకూలమే

రెస్టారెంట్లు, హోటళ్లతో పోల్చితే కూడళ్లు, రహదారుల వెంట ఉండే కర్రీస్ పాయింట్లలో లభించే కూరలు సామాన్య ప్రజలకు అందుబాటులోనే ఉన్నాయి. ఇక్కడ ఏ రోజుకు ఆ రోజు తయారు చేసేవి కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ కర్రీస్ పాయింట్లకే ఇస్తున్నారు. కూరలు విడివిడిగా తీసుకుకొవచ్చు. అన్నీ కలిపి తీసుకునే వెసులుబాటూ ఉంటుంది.

మహిళే నిర్వహకులు

ఖాళీగా ఇంట్లో కూర్చోకుండా స్వశక్తితో సంపాదించాలన్న లక్ష్యంతో కొందరు మహిళలు కర్రీస్ పాయింట్లను నిర్వహిస్తున్నారు. మగవారు కూడా వారికి సహకరిస్తూ వంటకాలకు అవసరమైన సామగ్రిని తెచ్చిపెడుతున్నారు. బయట ఏర్పాటైన కూరల అమ్మకాల సెంటర్లు చాలా మంది మహిళలకు ఉపాధిగా మారాయి. ఇందులో నిర్వహకులు కొందరైతే పనిచేసే వారు మరికొందరు.

నెల్లూరులో ధరలు ఇవి..

వంట	ధర (రూ.లలో)
చట్నీ	20
పప్పు	30
సాంబారు	30
రసం	30
వడల పులుసు	30
చికెన్ ఫ్రై	120-180
చేపల ఫ్రై	50
చేపల పులుసు	70-100
రొయ్యల ఫ్రై	100
తలకాయ కూర	150-300
బోటీ ఫ్రై	100
పక్కీల పులుసు	70-100

పార్శిళ్లే ఎక్కువ



మా దగ్గరకు వచ్చే వాళ్లు ఎక్కు వగా పార్శిళ్లు తీసుకెళ్తారు. అందు లో కర్రీస్ ఉంటాయి. ఇక్కడే తినే వాళ్లు చాలా తక్కువ. కూరలు ఎన్ని చేసిన అమ్ముడవుతాయి. ఏ రోజుకు ఆరోజు కూరగాయలు తీసుకువచ్చి వండి, విక్రయి స్తున్నాము.

- పొదిలి సుజాత, నిర్వహకురాలు

మిగిలిపోయేంతగా వండము



మిగిలిపోయేంతగా కర్రీస్ వండము. మిగిలితే మాకే కదా నష్టం. వాటిని నిల్వ ఉంచేందుకు మా దగ్గర వసతి లేదు. అందుకనే తక్కువగా వండుతున్నాము. రోజు వారి అమ్మకాలు ఏ మాత్రము ఉంటాయే అంచనా ఉంటుంది. దానిని బట్టి తయారు చేస్తాము.

- సురేష్, నిర్వహకుడు

ఇంట్లో ఇబ్బందిగా ఉన్నప్పుడే



ఇంట్లో ఇబ్బందిగా ఉన్నప్పుడు బయట నుంచి కూరలు తీసుకెళ్తుంటాము. అన్నం ఎలాగూ ఇంట్లో వండేసుకుం టాము. కర్రీస్ వరకు తీసుకెళ్తే సరిపో తుంది. ఆ పూటకు ఇబ్బంది ఉండదు. ఇలాంటి కర్రీస్ పాయింట్ల వల్ల చాలా ఉపయోగం. కూరల కోసం పెద్దగా ఆలోచించాల్సిన పనుండదు.

- బీరం పవన్‌కుమార్‌రెడ్డి

తొలిరోజు ఒక అర్జీనే..

- కొరవడిన ముందస్తు సమాచారం
- రెవెన్యూ సదస్సులకు హాజరుకాని రైతులు
- రెండోరోజు పీటీఎం సమావేశాలతో వాయిదా

పొదలకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో వేలాది ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి. చెరువులు, వాగులు, వంకలు, కొండలు, పోరంబోకు భూములు.. ఇలా రైతులకు తెలియకుండానే ఆన్‌లైన్‌లో పేర్లు మార్చేశారు. రీసర్వే కూడా మరిన్ని సమస్యలు తీసుకొచ్చింది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టింది. . భూవివాదరహిత గ్రామాలే లక్ష్యంగా అడుగులు వేసింది. శుక్రవారం పొదలకూరు మండలం విరువూరు నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు రెవెన్యూ, అనుబంధ శాఖల అధికారులు అందుబాటులో ఉండి ఆయా గ్రామాల్లో భూ సమస్యలు తెలుసుకోవాలి. వీలైతే క్షేత్రస్థాయికి వెళ్లి అక్కడికక్కడే కొన్నింటినైనా పరిష్కరించాలి. మొదటిరోజు రెవెన్యూ సదస్సుకు కేవలం ఒక అర్జీ మాత్రమే వచ్చిందని, పదిమంది రైతులు తమ పంట పొలాల్లో నీరు బయటకు వెళ్లే దానికి కాలువ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. మిగతా అంతా మొక్కుబడిగా సాగింది. ముందస్తు సమాచారం లేకోవడంతో చాలా చోట్ల సదస్సులు జరిగినా రైతులు రాక వెలవెలబోయాయి. శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాల సందర్భంగా మండలంలోని సూరాయపాలెం, మహమ్మదాపురంలో జరగాల్సిన రెవెన్యూ సదస్సులు వాయిదా పడ్డాయి.

బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలి

కావలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) పేదల బియ్యంను అక్రమ రవాణా చేసిన వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. పేర్కొన్నారు. స్థానిక జర్నలిస్ట్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కావలి కేంద్రంగా కొందరు రైస్‌మిల్లర్లు ఇలా చేస్తున్నా అధికారులు వారిపై చర్యలు తీసుకోక పోవడం విచారకరం అన్నారు. ఈ అక్రమ వ్యాపారాన్ని నిరోధించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో చలంచర్ల లక్ష్మయ్య, జలదంకి మల్యాద్రి, జనార్దన్, రామదాసు పాల్గొన్నారు.


బహిరంగ సభలో మాట్లాడుతున్న మూలం రమేష్

పోరాటాల పురిటిగడ్డ నెల్లూరు

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్
- ఇందుకూరుపేటలో పార్టీ 25వ మహాసభ ప్రారంభం

ఇందుకూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పోరాటాల పురిటిగడ్డ నెల్లూరు అని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. శనివారం ఇందుకూరుపేటలో ఆ పార్టీ జిల్లా మహాసభలు సభాధ్యక్షుడు టీవీవీ ప్రసాద్ అధ్యర్యంలో ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పార్టీ జెండాని ఆవిష్కరించి, రెడ్ సెల్యూట్ చేశారు. అనంతరం సబ్‌రిజిస్టర్ కార్యాలయం నుంచి షాదీమంజిల్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలి వరకు సీపీఎం నేతలు, ఆటో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో రమేష్ మాట్లాడుతూ ఎంతోమంది ఉద్యమకారులు ఈ జిల్లాలో పుట్టారని, ఎన్నో పోరాటాల్లో పాల్గొని అసువులు బాసారని అన్నారు. ఇందుకూరుపేట మండలంలో ఇప్పుడున్న సీపీఎం కమిటీ పలు సమస్యలపై పోరాడిందన్నారు. మైపాడును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని, పెన్నా కాజ్‌వే బ్రిడ్జి నిర్మాణం చేయాలని, మైపాడు-నెల్లూరు మధ్య 4లేన్ల రోడ్డు నిర్మించాలని... ఇలా అనేక పోరాటాలు చేసిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ కష్టజీవులకు, మహి ళలకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కామ్రేడ్ మోహన్‌రావు, మాల్యాద్రి, ముత్యాల గురునాథం, మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎం రాజా పాల్గొన్నారు.

ముగిసిన పాలీ టెక్‌ఫెస్ట్ వేడుకలు

కావలి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన రీజినల్ పాలీ టెక్‌ఫెస్ట్ వేడుకలు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ సెక్రటరీ రవికుమార్, కావలి విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నాగశేషయ్య, చేవూరులోని ఇండిసోల్ ప్రైవేట్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రంగారెడ్డి, రామాయపట్నం ప్రాజెక్టు మేనేర్ శేషుకుమార్, గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెడ్ ఆఫ్ జనరల్ బెహరా శ్రీనివాస్, డీఎస్పీ శ్రీధర్ పాల్గొన్నారు. ప్రదర్శనలో 56 వినూత్న ప్రాజెక్టులు రాగా వాటిలో 20 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన నెల్లూరు గీతాంజలి కళాశాల విద్యార్థులలకు డీఎస్పీ శ్రీధర్ రూ.25వేల నగదుతో పాటు బహుమతులు, ద్వితీయస్థానంలో నిలిచిన కావలి ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.10వేలతో పాటు బహుమతులు అందజేశారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

స్పీడ్ వాక్ ట్రాక్‌లో తొలగించిన పిచ్చిమొక్కలు



చుండి మోడల్‌స్కూల్ మైదానంలో పీఎంశ్రీ పథకం కింద ఏర్పాటు చేసిన స్పీడ్ వాక్ ట్రాక్‌లో ఉన్న పిచ్చిమొక్కలను ప్రిన్స్‌పల్ వెంకటేశ్వరన్ తొలగింపజేశారు. వాక్ ట్రాక్ మరిచారా అని గత 29వ తేదిన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

- పలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

చేపల పెంపకం, అమ్మకాలపై వేలం

- రూ.7.35 లక్షలు పలికిన ధర

లింగసముద్రం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మేదరమెట్ల పాలెం చెరువులో చేపల పెంపకం, అమ్ముకొనేందుకు శనివారం సర్పంచు కూరపాటి మాధవి అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలంలో 8 మంది పాల్గొనగా గ్రామానికి చెందిన కోట మల్లికార్జున రూ.7.35లక్షలకు పాడి హక్కులు దక్కించుకున్నారు. 2026 సెప్టెంబరు 30వరకు చేపలు పట్టుకోవచ్చన్నారు. ఈ మొత్తాన్ని గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులకు ఉపయోగిస్తామని సర్పంచ్ మాధవి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, కార్యదర్శి శ్రీహరి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, సీహెచ్ చెంచయ్య, విజయభాస్కర్ పాల్గొన్నారు.

దొంగ.. దొంగ

- బరితెగిస్తున్న ఇసుకాసురులు


మినగల్లు రీచ్ నుంచి రయ్‌మని దూసు కెళుతున్న టిప్పర్లు

పొద్దుగూకితే చాలు బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లు రీచ్ నుంచి ఇసుక టిప్పర్లు రయ్.. రయ్‌మంటూ దూసుకెళుతున్నాయి. ఈ అక్రమ రవాణాకు అధికార పార్టీ నాయకులే తెరవెనుక ఉండి నడిపిస్తుండటంతో అధికారులు కూడా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. శుక్రవారం వేకువ జామున జొన్నవాడ మీదుగా ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా కొందరు యువకులు ఆ టిప్పర్లను అడ్డుకున్న విషయం తెలిసిందే. అయినా బరితెగించి శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం వేకువజాము వరకు టిప్పర్ల కొద్దీ ఇసుకను సరిహద్దు దాటించారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నమ్మి నాయకుడిగా పెద్ద పీట వేస్తే వారే అక్రమాలకు తెరలేపుతుండటంతో విమర్శలకు తావిస్తోంది.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)



వేదగిరిపై 24 గంటల గోవిందనామ సంకీర్తన

నెల్లూరు రూరల్లోని వేదగిరి క్షేత్రం లక్ష్మీనర సింహ స్వామి ఆలయంలో శనివారం గురుపాదుక పీఠం వారు 24 గంటల అఖండ గోవిందనామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు గణపతి పూజ, జ్యోతిప్రజ్వలన చేసి ఈ వినూతన్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషమని, ఇవి ఎందరినో ప్రోత్సహిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో, ఇతర సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

- నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి)

'ఉపాధి' లక్ష్యాన్ని అధిగమించాలి

● డ్వామా పీడీ గంగాభవాని

నెల్లూరు(జడ్పీ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల లక్ష్యాన్ని అధిగమించేలా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని డ్వామా పీడీ గంగాభవాని ఆదేశించారు. నగరంలోని డ్వామా కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 119 లక్షల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పండ్ల తోటల పెంపకం, గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించడం, గ్రామాల్లో అంతర్గత సిమెంటు రోడ్లు, ఇంకుడు గుంతలు, పక్కా గృహాల నిర్మాణాలు తదితర పనులకు సంబంధించి లక్ష్యాలకు అనుగుణంగా పని దినాలు కల్పించాలన్నారు. పశువులు, గొర్రెలు, కోళ్ల పెంపకంపై రైతుల్లో చైతన్యం పెంపొందించాలని తెలిపారు. సమావేశంలో ఏపీడీవోలు, అదనపు కార్యక్రమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణించేదెలా?

కోవూరు మండలంలోని పాటూరు- ఎల్లాయపాళెం రోడ్డు అడుగడుగున గుంతలమయమై అధ్వానంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గుంతల్లో నీరు నిల్వ చేరి నడవడానికి కూడా వీలుకాని విధంగా తయారైంది. ఈ క్రమంలో కోవూరు మండలంలోని పాటూరు, కొడవలూరు మండలంలోని ఎల్లాయపాళెం గ్రామాల మధ్య రాకపోకలకు కష్టతరంగా మారింది. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది ద్విచక్ర వాహనాల్లో తిరుగుతుంటారు. ఎల్లాయపాళెం నుంచి నెల్లూరుకు ప్రైవేటు బస్సులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటాయి. పల్లెపాలెం పరిసర ప్రాంత గ్రామాల్లో పండించిన ఆకుకూరలు, కాయగూరలను రైతులు, చిన్న వ్యాపారులు మోటారు బైక్‌లు, సైకిళ్లపై ఇదే మార్గంలో తరలిస్తుంటారు. ప్రస్తుతం రోడ్డు దుస్థితిలో ఉండడంతో ఈ రోడ్డుపై ప్రయాణం సాగించేదెలా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- కోవూరు,(ఆంధ్రజ్యోతి)



హోంగార్డు డీఎస్పీ వెంకటరమణ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 7(ఆంధ్ర జ్యోతి): హోంగార్డు డీఎస్పీగా ఎన్ వెంకట రమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. 1991లో ఆర్ఎస్ఐగా పోలీసుశాఖలో బాధ్య తలు చేపట్టిన వెంకటరమణ ఆర్ఎస్ఐగా, ఆర్ఐగా కాకినాడ, రాజమండ్రి, విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాదు, గుంటూరులలో పనిచేశారు. డీఎస్పీగా హైదరాబాద్, విశాఖపట్నంలో విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో మంగళగిరి ఆక్టోపస్‌లో పనిచేస్తూ నెల్లూరు హోంగార్డు డీఎస్పీగా నియమితులయ్యారు.



ఎస్పీకి పూలమొక్క అందజేస్తున్న హోంగార్డు డీఎస్పీ వెంకటరమణ

డ్రగ్స్ వద్దు బ్రో!

● పీటీఎంలో పోలీస్ శాఖ అవగాహన



డ్రగ్స్‌పై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్పీ తదితరులు

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి) : మెగా టీచర్స్ పేరెంట్స్ సమావేశాల్లో (పీటీఎం) పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. నెల్లూరులోని ధనలక్ష్మీపురంలో జరిగిన సమావేశంలో ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు విద్యార్థులకు తల్లిదండ్రులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించినట్లు చెప్పారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించి, ప్రతిజ్ఞ చేయించినట్లు చెప్పారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని విద్యార్థులకు ఎస్పీ సూచించారు. అలాగే ప్రజలకు సోషల్ మీడియా, సైబర్ క్రైమ్, మహిళా భద్రత, రోడ్డు భద్రత, ఇంటి భద్రతపై అవగాహన కల్పించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల ఏడుగురు మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి శనివారం ఆర్థిక సాయం అందచేశారు. ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున అందచేయడంతో వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇనమడుగులో పూరిల్లు దగ్ధం

కోవూరు, డిసెంబరు7: మండల పరిధిలోని ఇన మడుగు గిరిజన కాలనీకి చెందిన కందుకూరు సురేష్ పూరిల్లు శనివారం దగ్ధమైంది. సురేష్ భార్య వనమ్మ ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి, ఇంటికి నిప్పు అంటుకుంది. దీంతో ఇల్లు పూర్తి గా కాలిపోయింది. వీఆర్వో హరికృష్ణ ఫోన్ చేయడంతో నెల్లూరు నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంట లను అదుపుచేశారు. అప్పటికే ఇల్లు పూర్తిగా కాలడంతో గృహోపకరణాలన్ని బూడిదయ్యాయి.



పూర్తిగా కాలిన పూరిల్లు

పడుగుపాడులో వివాహిత బలవన్మరణం

కోవూరు, డిసెంబరు7: మండలంలోని పడుగుపాడులో ఓ వివాహిత శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాలు... ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న వెంకటరమణ భార్య శిరీష(28) ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సహాయంతో ఆమెను 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థల వల్ల ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శిరీష మృతదేహం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	96
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	180
స్కిన్‌లెస్	200
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7328
వెండి కిలో ధర	రూ. 92,800
వెండి ఒక గ్రాము	రూ.95.80

పోలీసుల అదుపులో నిందితుడు?

ఉదయగిరి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భార్యను కత్తితో పొడిచి చంపి పరారీలో ఉన్న భర్త మస్తాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 3న పట్టణంలోని కావలి మార్గంలో గల ఎస్టీ కాలనీలో భార్య ఇందిరను కత్తితో పొడిచి మస్తాన్ పరారయ్యాడు. అప్పటి నుంచి పోలీసులు అతని ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం దుత్తలూరు మండలం వెంకటంపేట గ్రామ సమీపాన గల అటవీ ప్రాంతంలో నిందితుడు సంచరిస్తుండగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు తెలిసింది. కాగా, దీనిపై పోలీసుల నుంచి ఎలాంటి సమాచారం అందలేదు.

కౌలు రైతుకు దక్కని రుణం..

అతివృష్టి, అనావృష్టిలతోపాటు సరైన మద్దతు ధర లభించకపోవడంతో రైతులు ప్రతిఏటా ఇబ్బందులు పడుతున్నారు. అయితే కౌలు రైతుల కష్టాలు మరింత దారుణం. బ్యాంకుల నుంచి రుణాలు అందక వారు పడుతున్న ఆవేదన మాటల్లో చెప్పలేనిది. బయట అధిక వడ్డీలకు అప్పులు చేయడం లేదంటే భూ యజమానికి నగదు, ధాన్యం రూపంలో ఒప్పందాలు కుదుర్చుకుని వ్యవసాయం చేస్తున్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు అందిస్తున్నామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నా రుణాలు తీసుకునే రైతులు మాత్రం వందల్లోనే ఉంటున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యలు పరిష్కరించాలని రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతులు వేడుకుంటున్నారు.


- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

● లక్ష్యానికి మించి వేలల్లో గుర్తింపు కార్డుల మంజూరు
● రుణాలు అందేది మాత్రం వందల సంఖ్యల్లోనే
● నిబంధనల సాకుతో బ్యాంకర్ల నిరాకరణ
● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

జిల్లాలో దాదాపు 5 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. అధికంగా వరి సాగవుతుండగా మినుము, వేరుశనగ, శనగ తదితర పంటలతోపాటు ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 4లక్షల మంది వరకు రైతులు ఉండగా దాదాపు 2.5లక్షలకుపైగా కౌలు రైతులు ఉంటారనేది అంచనా. వ్యవసాయశాఖ అధికారుల లెక్కల ప్రకారం వేలల్లోనే ఉన్నారు. ఏటా జిల్లాకు ఇచ్చిన లక్ష్యానికి మించి కౌలు రైతు గుర్తింపు కార్డులు అందిస్తూనే ఉన్నారు. కానీ రుణాలు అందేది మాత్రం వందల సంఖ్యలోనే. 2022-23లో 15,199 కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వాలనేది లక్ష్యంకాగా 17,399 మందికి అంటే లక్ష్యానికి మించి వ్యవసాయ శాఖ అధికారులు కార్డులు అందించారు. అయితే రుణాలు పొందిన కౌలు రైతు సంఖ్య కేవలం 6,800 మంది మాత్రమే. 2023-24లో 24,470 మందికి కార్డుల లక్ష్యం కాగా 31,618 మందికి అందించారు. కానీ కనీసం ఒక్కరికి కూడా రుణం మంజూరు కాలేదు. 2024-25లో 38,330 కార్డులు లక్ష్యం పెట్టుకోగా 32,506 మందికి కార్డులు ఇచ్చారు. ఇప్పటి వరకు 1020 మందికి మాత్రమే రుణాలు అందినట్లు వ్యవసాయశాఖ రికార్డులు చెబుతున్నాయి. జిల్లాకు రబీ సీజన్ ఎంతో ప్రధానమైనది. తుపానుల ప్రభావంతో ఇప్పటికే ఎంతోమంది రైతులతోపాటు కౌలురైతులు సాగు ప్రారంభ దశలోనే నష్టపోయారు. ఈ సీజనుకైనా కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని కోరుతున్నారు. కనీసం అధికారులు గుర్తించి కౌలు రైతు కార్డులు ఇచ్చిన వారికైనా రుణాలు అందించాల్సిన అవసరం ఉంది.

● సమస్యలివీ..

పొలం కౌలుకు తీసుకుని వివిధ పంటలు సాగుచేసు కుంటున్న కౌలు రైతులకు తప్పకుండా రుణాలు ఇవ్వా లని జిల్లా ఉన్నతాధికారులు బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం నామమాత్రంగానే ఉం టోంది.. భూయజ మాని పొలం సాగు చేయకపోయినా వాళ్లకే రుణాలు అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చిన కౌలు రైతు గుర్తింపు కార్డులను తీసుకుని రుణం కోసం బ్యాంకులకు వెళ్లిన కౌలు రైతులకు రుణా లిచ్చే పరిస్థితి లేదు. అదే మిటని ప్రశ్నిస్తే ఆ సర్వే నెంబరుపై ఇప్పటికే రుణాలు తీసుకున్నారని చెబుతున్నారు. అంతే గాక గతంలో అదే సర్వే నెంబరుపై తీసు కున్న రుణాలు చెల్లిం చలేదని నిరాకరిస్తు న్నారని రుణాలు ఇస్తే తిరిగి చెల్లించక పోతే ఎవరిని అడగాలని నిబంధనలను వివరిస్తూ సూటిగా ప్రశ్నించడంతో సమాధానం చెప్పలేక తిరి గొచ్చేస్తున్నామని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లో కౌలు రైతులు వడ్డీ వ్యాపారులు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల నిర్వాహకుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు అందిస్తున్నాం



కౌలురైతు గుర్తింపు కార్డులు కలిగిన కౌలు రైతులకు రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నాం. రుణాలు తీసుకోని భూయజమానుల జాబితా, కౌలు రైతుల జాబితాలను సిద్ధం చేసి ఇప్పటికే బ్యాంకర్లకు అందించడం జరిగింది. మండల వ్యవసాయశాఖ అధికారులే రైతులను బ్యాంకుల తీసుకెళ్లి బ్యాంకర్లతో మాట్లాడుతున్నారు. నిబంధనల మేరకు అర్హులైన ప్రతిఒక్క కౌలు రైతుకు రుణం అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలి : వీఎస్‌యూ వీసీ

వెంకటాచలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంతో పాటు క్రీడా, కళా, సాంస్కృతిక తదితర రంగాల్లోనూ విద్యార్థులు ప్రగతి సాధించాలని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయ భాస్కర్ రావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో మూడురోజులుగా నిర్వహిస్తున్న విద్యార్థి ప్రవేశ ఉత్సవం శనివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతోగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు వీసీ ధ్రువీకరణ పత్రాలతోపాటు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం హనుమారెడ్డి, కావలి పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీ వీరారెడ్డి, డాక్టర్ జీ మేరీసందీప్, డాక్టర్ టీ విమల, డాక్టర్ పీబీ సుచరిత, డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు

ఎలాంటి సమీక్ష లేకుండా తొలగించారు

● ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎంపీహెచ్ఏ(ఎం)లను నిర్ణీత గడువులోగా తొలగించి తాజాగా నియామకపు మెరిట్‌ను ప్రకటించాలన్న తెలంగాణా హైకోర్టు తీర్పును అమలు పరచటంలో అధికారులు ఎలాంటి సమీక్ష లేకుండా నిర్ణయిం తీసుకున్నారని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు బీ.సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. ఏపీజీఈఏ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1600 మందికి పైగా మగ ఆరోగ్య కార్యకర్తలను తొలగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 3 నెలల ముందు నోటీసు ఇచ్చి, మూడు నెలల జీతం కూడా చెల్లించిన తరువాతే తొలగించాలనే సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరించారన్నారు. ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శి పీవీఎస్‌టీ రాంప్రసాద్ మాట్లాడుతూ హైకోర్టు తీర్పుకు లోబడి నిర్ణీత గడువులోగా నియామక లోపాలు సరిచేసుకుని వారిని తిరిగి విధుల్లోకి తీసుకునే మార్గాలను ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించి అన్వేషించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.రమణారెడ్డి, సిటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

విద్యార్థుల ఇబ్బందులపై డిప్యూటీ సీఎం ఆరా

● రూ.55 లక్షలతో సిమెంటు రోడ్డుకు ప్రతిపాదనలు

కలువాయి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని రాజుపాళెంలో పిల్లలు బడికి పోవాలంటే కిలోమీటరు దూరం బురదలోనే నడవాల్సిన దుస్థితిపై ఈనెల 3వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచు రితం కావడంతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించారు. గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ కాలనీలకు వెళ్లే రోడ్డు వర్షం పడితే రొచ్చు రొచ్చుగా తయారై గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు బురదలోనే నడుచుకుం టూ పాఠశాలకు వెళ్తున్నారు. ఈ విషయాన్ని పవన్ కల్యాణ్‌ను ట్యాగ్ చేస్తూ కొందరు ట్వీటర్‌లో కూడా ఉంచారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్‌శాఖ డీఈ ఏడుకొండలు, ఏఈ జయరామిరెడ్డి రోడ్డును పరిశీలించారు. అనంతరం పాఠశాలకు వెళ్లి రోజూ ఎంతమంది విద్యార్థులు బడికి వస్తున్నారు తదితర వివరాలు తెలుసుకున్నారు. రోడ్డు దుస్థితిపై నివేదికతో పాటు సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.55లక్షలతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపినట్లు ఏఈ జయ రామిరెడ్డి తెలిపారు.



రాజుపాళెంలో రోడ్డును పరిశీలిస్తున్న పంచాయతీరాజ్‌శాఖ అధికారులు

పెంచలోరికి భారీ విరాళం

రాపూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన ఆలయ అభివృద్ధిలో భాగంగా లడ్డు పోటు నిర్మాణానికి కడపజిల్లా వాస్తవ్యులు సానేపల్లి చిన్నపెంచలరెడ్డి, లక్ష్మమ్మ జ్ఞాపకార్థం కుమారుడు సానేపల్లి రామ్మోహన్‌రెడ్డి 60వేల అమెరికా డాలర్స్ ఇండియా కరెన్సీ రూ.50లక్షల చెక్కును శనివారం అందజేశారు. కాగా, శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకం, కల్యాణోత్సవం, సాయంత్రం తిరుచ్చి పల్లకీ సేవ నిర్వహించినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.



చెక్కును అందజేస్తున్న దాతలు

10న సబ్ జూనియర్ ఆర్చరీ జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 10వ తేదీ ఉదయం 9 గంటలకు సబ్ జూనియర్ ఆర్చరీ జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు ఒక ప్రకటనలో తెలిపా రు. ఎంపికైన జట్లు రాజమండ్రిలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఆర్చరీ పోటీలకు జిల్లా నుంచి ప్రాతి నిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు ఆధార్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని స్కూటరిస్టుకు తీవ్రగాయాలు

సంగం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగం నెల్లూరు జాతీయ రహదారిపై తరుణవాయి క్రాస్ రోడ్డు దాటిన తరువాత బుచ్చి వైపు వెళ్తున్న మోటారుబైక్‌ను ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం శనివారం సాయంత్రం ఢీకొంది. ఈ ప్రమాదంలో బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన చిరంజీవికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జాతీయ రహదారి అంబులెన్స్ బాధితున్ని బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

14న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ఆత్మకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదర్శనకు కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సు సర్వీస్‌ను ఏర్పాటుచేసినట్లు డిపో మేనేజర్ కరీమున్నిసా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 14వ తేదీ ఉదయం 8 గంటలకు ఆత్మకూరు డిపో నుంచి బస్సు బయలుదేరుతుందని, టికెట్ ధర రానుపోను ఒకరికి రూ.1400గా నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ సౌకర్యం ఉందని, అరుణాచలం వెళ్లానుకునే ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. దారి మార్గంలో ఉన్న కాణిపాకం, సిరిపురం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, గిరిప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఇతర సమాచారం కోసం డీఎం ఆత్మకూరు 9959225645, సీఐ 7382924753, డివి సుబ్బయ్య కండక్టర్ 8555929504 నంబర్లను సంప్రదించాలని కోరారు.

10న జరిగే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయింట్ ఆఫీస్, సీడాప్‌ల ఆధ్వర్యంలో ఈనెల 10న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్ నారాయణస్వామి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో హీరో మోటార్ కార్పొరేషన్ లిమిటెడ్, అక్సలెంట్ ఫార్మా సైన్స్, ఇన్నేవ్‌సోర్స్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. పది, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9177824585, 9491284199 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు.

పీఎంఏవైలో ఎస్టీలకు పక్కా గృహాలు మంజూరు

ఎండీ గౌస్‌మొహిద్దీన్, హౌసింగ్ ఏఈ



సంగం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకంలో గిరిజనులకు ప్రభుత్వం పక్కాగృహాలను మంజూరు చేస్తుందని గృహనిర్మాణ ఏఈ ఎండీ గౌస్‌మొహిద్దీన్ తెలిపారు.

ఇంటర్వ్యూ

? పీఎంఏవై పథకంలో మండలానికి ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి.

! మండలాలకు ఇళ్లను కేటాయించలేదు. సచివాలయాల్లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులైన గిరిజనులందరికీ పక్కా గృహాలు మంజూరు చేయడం జరుగుతుంది.

? గృహనిర్మాణ శాఖలో కొత్త ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల ప్రాగ్రస్ ఎంత వరకు వచ్చింది.

! మండలంలో డిసెంబరు నెలాఖరుకు వంద రోజుల్లో 362 పక్కా గృహాలు పూర్తి చేయాలని నిర్దేశించగా ఇప్పటి వరకు 127 నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగినవి వివిధ దశల్లో ఉన్నాయి.

? వ్యక్తిగతంగా కాలనీ ఇళ్లు నిర్మించుకునేవారికి బిల్లులు మంజూరు అవుతున్నాయా.

! లబ్ధిదారులు స్వయంగా ఇళ్లు నిర్మించుకుంటే సిమెంట్, ఇనుము సరఫరా చేస్తున్నాం. బిల్లులకు ప్రభుత్వానికి అప్‌లోడ్ చేస్తున్నాం. నిధులు విడుదల చేయగానే లబ్ధిదారుల ఖాతాలో నగదు జమవుతుంది.



ఆత్మకూరు: పీటీఎం కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి ఆనం



ఉదయగిరి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం

● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ఆత్మకూరు మున్సిపాలిటీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను పాఠశాలలో పాఠాలు బాగా చెబుతున్నారా.. ఆటలాడిస్తున్నారా.. మధ్యాహ్న భోజనం బాగుందా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల కంటే నాణ్యమైన విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే లభిస్తుందని, తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో విద్య నభ్యసించే తాను ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో విద్యారమ, ఆర్డీవో పావని, డిప్యూటీ డీఈవో జానికీరామ్, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, ఎంపీడీవో ప్రవీణ్ ఐజాక్, ఎంఈవో జ్యోతి పేరెంట్స్ కమిటీ చైర్మన్‌లు, నాయకులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● సంగం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం పండుగ వాతావరణంలో జరిగింది. స్థానిక గురుకుల కళాశాల, సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో జరిగిన పీటీఎం సమావేశాల్లో నోడల్ ప్రత్యేకాధికారి రమేష్ నాయక్, తహసీల్దారు సోమ్లానాయక్, ఎంపీడీవో షాలెట్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని పలుసూచనలు సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

● కలువాయి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం పండుగ వాతావరణంలో నిర్వహించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల సమావేశంలో మండల ప్రత్యేక అధికారి అనిత, హెచ్‌ఎం అబ్బాస్‌ఆలీ, ఎంఈవో-2 శేషగిరిరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ మహేష్, నాయకులు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు, చల్లా రఘురామిరెడ్డి, అల్లంపాటి వేణు గోపాల్‌రెడ్డి, దండు పెంచలయ్యలు, గడ్డం కిషోర్‌రెడ్డి, చల్లా శివారెడ్డి పాల్గొన్నారు. తెలుగురాయపుంలో హెచ్‌ఎం మురళీకృష్ణ, రాం నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అనంతసాగరం: మండలంలోని కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాలలో శనివారం ఉత్సాహంగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల ప్రగతి వివరించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసుంధరాదేవి, మనోజ్‌కుమార్, వెంకటరమణరాజు పాల్గొన్నారు.

● ఏఎస్ పేట : మండలంలోని అన్ని పాఠశాలల్లో శనివారం తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్ట్‌లను అందించారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిరమన జడ్పీహైస్కూల్‌లో యాజమాన్య కమిటీ చైర్మన్ శ్రీధర్ నాయుడు, కావలి ఎడవల్లి హైస్కూల్‌లో ఎంపీడీవో ప్రసన్నకుమారి, ఎంపీపీ పద్మజారెడ్డి, ఉపాధ్యా యులు, పాల్గొన్నారు.

● మర్రిపాడు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం జరిగింది. విద్యార్థుల తల్లి దండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షులు ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, ఎంఈవో ధనలక్ష్మి పాల్గొన్నారు.

విద్యతోనే ఉదయగిరి అభివృద్ధి : ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేసేందుకే మంత్రి నారా లోకేష్‌బాబు పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి(పీటీఎం) శ్రీకారం చుట్టారని, విద్యతోనే మెట్ట ప్రాంతమైన ఉదయగిరి అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో నిర్వహించిన పీటీఎం సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, వసతిగృహం, భోజనశాలలను పరిశీలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్పరాజ్, సర్పంచ్ జీ కల్పన, పీఎంసీ చైర్మన్ శ్రీనివాసులు, తహసీల్దారు సుభద్ర, ఎంఈవో శ్రీనివాసులు, ఎంపీడీవో అప్పాజీ, టీడీపీ నాయకులు వెంకటసుబ్బయ్య, ఉమా సాయిరాం, నరసింహారావు, వెంకటేశ్వర్లు, రియాజ్ పాల్గొన్నారు.

● వరికుంటపాడులో: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎం సమావేశంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. అనంతరం పాముూరుపల్లిలోని సుబ్బరాయుడుస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న షష్టి మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● దుత్తలూరులో: దుత్తలూరు ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన పీటీఎం సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించడంతోపాటు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వింజమూరు : జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశానికి ఎమ్మెల్యే కాకర్ల ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని వారిని తీర్చిదిద్దడం అందరి బాధ్యత అని తెలిపారు. ముందుగా హైస్కూల్ ప్రాంగణంలోని సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మధుసూదన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మాలకొండరావు, ఉపాధ్యాయులు మహేష్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● సీతారామపురం: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్‌హైస్కూల్, కెజిబీవి, మోడల్ స్కూల్స్‌లో మెగా పేరంట్స్ కమిటీ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రమైన సీతారామపురం ఎంపీపీఎస్ స్కూల్(స్పెషల్)లో ఎంఈఓ మస్తాన్‌వలి పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో యస్ఎంసి చైర్మన్, దాతలు,స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు అందచేస్తా : ఎమ్మెల్యే దగుమాటి

కావలి, (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు జడ్పీ ఉన్నత పాఠశాల, తుమ్మలపెంట బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని విద్యార్థులకు సొంత నిధులతో స్కూల్ బ్యాగులు అందచేస్తానని తెలిపారు. తుమ్మలపెంట గురుకుల పాఠశాలలో ప్రహరీ నిర్మాణం, అసంతృప్తిగా ఉన్న డైనింగ్‌హాల్ సమస్యను హెచ్‌ఎం పద్మావతి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లల తల్లి దండ్రులకు ముగ్గుల పోటీలు, తాడులాగే పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో డీఎస్పీ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, మండల విద్యాధికారులు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఎమ్పీడీవో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

●అల్లూరు: ఇస్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్ కమిటీ సమావేశాలు పండుగ వాతారణంలో జరిగాయి. మండలకేంద్రంలోని రామకృష్ణ జూనియర్ కళాశాల, పాఠశాల విభాగంలో, జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో ముఖ్యఅతిథులుగా అల్లూరు టీడీపీ మండలాధ్యక్షుడు బండి శ్రీనివాసులు రెడ్డి, జనసేన మండలాధ్యక్షుడు కారుమంచి కార్తీకశర్మలు పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఉమామహేశ్వరరావు, నాయకులు మేడా కృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, ఊటు శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●జలదంకి : తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని తెలుగుగంగ డిప్యూటీ కలెక్టర్ మురళీక్రిష్ణ తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో శనివారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని కావున పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలోనే చదివించి ప్రయోజకులను చేయాలన్నారు. సమావేశం అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అతిథులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ సుందరయ్య, సర్పంచ్ అనూరాధ, ఉపసర్పంచ్ మాలకొండారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు మధురెడ్డి, పీఏసీఎస్ మేనేజర్ యూన్సీ, ఆర్ఐ శ్రీజ, ఎంఈఓ శ్రీధర్, పూర్వవిద్యార్థులు హరినారపరెడ్డి, నరసింహం, లక్ష్మీరెడ్డి, శేషారెడ్డి పాల్గొన్నారు. మిగిలిన 58 ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శన అలరించింది.

● బిట్రగుంట: విద్యార్థి దశ నుంచి లక్ష్యం సాధించేందుకు పట్టుదలతో చదవాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. కప్పరాళ్లతిప్పలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఆటపోటీల విజేతలకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, ఎంఈవోలు నరసింహారావు, జయమ్మ, సీఐ పాపారావు, టీడీపీ నేతలు నాగేశ్వరావు, సుధీర్‌బాబు, వెంకటేశ్వర్లురెడ్డి ఉన్నారు.

● కొండాపురం: సాయిపేట శ్రీదామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు గంటా లక్ష్మీనరసింహులు, దామా మహేశ్వరారవు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాలను మండల విద్యాధికారులు-1,-2 కే.రవికుమార్, ఆనందరావులు పర్యవేక్షించారు.

● కలిగిరి: స్థానిక జెడ్పీ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎంపీఓ జీ సురేష్, తహసీల్దారు రవీంద్రబాబు, ఎంపీడీఓ ప్రత్యూష, ఎస్ఐ ఉమాశంకర్‌లు హాజరయ్యారు. జెడ్పీ హైస్కూల్‌లో పాఠశాల స్థలదాత రామానాయుడు చిత్రపటానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థుల తల్లులకు ముగ్గులపోటీలు, తల్లిదండ్రులకు టగ్‌ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. కలిగిరి మెయిన్ స్కూల్ ఉత్తమ ఉపాధ్యాయురాలు కర్తం అరుణను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమాల్లో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం భీమేశ్వరరావు పాల్గొన్నారు.

● కందుకూరు : పట్టణంలోని అభ్యుదయ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ సుబ్బారెడ్డి ముఖ్య అతిథి పాల్గొన్నారు. అలాగే పాలూరు యూపీ స్కూల్‌లో హెచ్‌ఎం బొజ్జా రమణయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎం వేదవతి తదితరులు పాల్గొన్నారు.

● లింగసముద్రం : పిల్లల చదువుల బాధ్యతలను ఉపాధ్యాయులతో పాటు తలిదండ్రులు తీసుకోవాలని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం మాధవరావు అధ్యక్షతన జరిగిన పీటీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. 18ఏళ్లలోపు పిల్లలు బడిలో ఉండాలన్నారు. తల్లిదండ్రులే పిల్లలకు మొదటి గురువులు అన్నారు. పెంట్రాల, వాకమళ్లవారిపాలెం, లింగసముద్రం, తిమ్మారెడ్డిపాలెం పాఠశాలల్లో ఎంఈఓ-1 కె రవికుమార్, ఎంఈఓ-2 ఎంవి శివకుమార్‌లు సమావేశాలను నిర్వహించారు.

● ఉలవపాడు: వీరేపల్లి మోడల్ స్కూల్‌లో జరిగిన సమావేశానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధరకాల పోటీల విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు.

● వలేటివారిపాలెం: చుండి, వలేటివారిపాలెం, పోకూరు, నలదలపూరు, శాఖవరం గ్రామాల్లో జరిగిన సమావేశంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చుండి మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ శ్రీవెంకటేశ్వరన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్పీటీసీ భారతి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు, తల్లిదండ్రులకు తాడులాగే ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా పరికరాల కోసం జడ్పీటీసీ దంపతులు భారతి, హరిబాబులు రూ.10వేలను అందజేశారు. అయ్యవారిపల్లె టెంకం కొండలరావు మైకుసెట్, రూ.5వేలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇరపని సతీష్, ఎంపీటీసీ సభ్యులు చౌడబోయిన యానాది, ఎస్ఎంసీ చైర్మన్ చొప్పర వసంతరావు, దాతలు చెరువుపల్లి సాంబశివరావు, ఎస్ఐ మరిదినాయుడు, డిప్యూటీ తహసీల్దార్ నాయబ్‌రసూల్, కామినేని వీరయ్య పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ఉదయగిరి రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అయ్యప్ప మాలదారులు శనివారం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని చేపట్టారు. మెయిన్ బజార్, గండిపాళెం మార్గం, బాలాజీనగర్, యాదవ పాళెం, సినిమాహాలు వీధి, సుద్దబావి వీధి ప్రాంతాల్లో గ్రామోత్సవం నిర్వ హించారు. భక్తులు కాయా కర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పంట నష్ట పరిహారం చెల్లింపునకు ఉత్తర్వులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఫెంగల్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు పీ చెన్నారెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 33 శాతం పంట నష్టపోయిన రైతులను గుర్తించి జాబితాలను తయారుచేయడం జరుగుతుందన్నారు. వీఆర్వో, సర్వేయరు, వీఏఏల ఆధ్వర్యంలో దెబ్బతిన్న పంటలను సందర్శించి నివేదికలను తయారు చేస్తామన్నారు. ఇటీవల విత్తిన శనగ పంట నష్టపోయిన రైతులకు తిరిగి విత్తు కొనేందుకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అవసరమైన ఇండెంట్ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. పంట నష్టపోయిన రైతుల జాబితాలను రైతుసేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తామన్నారు.

ఇష్టారాజ్యంగా వ్యాపార బోర్డుల ఏర్పాటు

● ప్రధానరోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం



అల్లూరు ప్రధానరోడ్డులో ఏర్పాటు చేసిన షాపు బోర్డింగులు

అల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని హైస్కూలు, కస్తూరిదేవి పార్కు, పాత బస్టాండు కూడళ్లలో కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా తమ ప్రకటనలతో కూడి బోర్డింగులు రోడ్డుకు అడ్డుగా ఏర్పాటు చేశారు. ఈ సమస్యతో ఎదురెదురుగా వచ్చే వాహనాలకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఫోర్‌వే రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు చేసి వ్యాపారుల సామాగ్రి, బోర్డింగులు బయటికి పెట్టేయడం, వాటికి ఎదురుగా వాహనాలు పార్కింగ్ చేయడంతో కేవలం డబుల్ రోడ్డుకు మాత్రమే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. వీటికి తోడు ఆవుల సమస్య ఉండడంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. ఇంత జరుగుతున్నా నగర పంచాయతీ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



కావలి: ముసునూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



అల్లూరు : సైకిళ్లు పంపిణీ చేస్తున్న బీద గిరిధర్, తదితరులు

విద్యుదాఘాతంతో రెండు గేదెల మృతి

కలువాయి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు మృతి చెందిన సంఘటన శనివారం చింతలాత్మకూరులో జరిగింది. గ్రామస్థుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఏడాదిన్నర క్రితం చింతలాత్మకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వెరుబొట్లపల్లి, కేశమనేనిపల్లి గ్రామాల కోసం కొత్తగా లైన్ వేశారు. ఆతరువాత ఈ విద్యుత్ లైన్ అవసరం లేకపోవడంతో సబ్‌స్టేషన్ వద్ద కనెక్షన్ ఇవ్వకుండా వైర్లు నేలపై వదిలేశారు. ఈనేపథ్యంలో సోంపల్లి నిరంజన్‌కు చెందిన రెండు గెదెలు శనివారం అటువైపు వెళ్లి విద్యుదాఘాతానికి గురై చనిపోయాయి. వీటి విలువ రూ.2లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

జలదంకి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక నెహ్రూనగర్ గిరిజన కాలనీ పేదలకు శనివారం శ్రీసాయి చారిటబుల్ ట్రస్టు సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డె శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ముడి కిషోర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు అళహరి పద్మావతి, సునీత, పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోండి

ఉలవపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకుల, కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు చేస్తున్న సమ్మెను విరమించకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ఇచ్చిన సోకాజ్ నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన గురుకులాల్లో 560 మంది అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు డీఎస్సీలో మినహాయింపు ఇవ్వాలన్నారు.

ఆర్‌ఎస్‌ఆర్‌లో జేఎన్‌టీయూఏ వాలీబాల్ ఎంపికలు

బిట్రగుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడనూతల ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూఏ యూనివర్సిటీ అనంతపురం వారు శనివారం వాలీబాల్ ఎంపికలు నిర్వహించారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ నారాయణరెడ్డికి క్రీడాకారులను కళాశాల వ్యవస్థాపకులు ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పీవీఎన్‌రెడ్డి పరిచయం చేశారు. కార్యక్రమంలో క్రీడా ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి, ఏవో రమణారెడ్డి ఉన్నారు.

బొల్లినేని సురేంద్రకు ఘన నివాళి

వింజమూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని రామారావు కుమా రుడు సురేంద్రకు ఆయన నివాసంలో శనివారం ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు వెలుగోటి మధు నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో నాయకులు, పాల్గొన్నారు.

● కలిగిరి : పెద్దపాడులోని బొల్లినేని సురేంద్ర స్వగృహానికి శనివారం ఏపీ ఎన్జీఓస్ అధ్యక్షుడు వెలుగోటి మధు వెళ్లి సురేంద్ర తండ్రి బీవీ రామారావు, కుటుంబసభ్యులను పరామర్శించారు. సురేంద్ర చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.



వింజమూరు : నివాళి అర్పిస్తున్న ఎన్జీవో అధ్యక్షుడు వెలుగోటి మధు

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే దగుమాటి పరామర్శ

కావలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపెంట అగ్నిప్రమాద బాధితుడు వాయిల పొట్టయ్యను శనివారం ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు రామకృష్ణ ప్రధాన కార్యదర్శి వెంకట్రావు ఉన్నారు.

రాష్ట్రస్థాయి టెక్ ఫెస్ట్‌కు 'ప్రకాశం' ప్రాజెక్ట్

కందుకూరు: ఒంగోలు డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన పాలిటెక్నిక్ ఫెస్ట్ -24లో ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ డిప్లమో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి టెక్‌ఫెస్ట్‌కు ఎంపికైనట్లు కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ఆర్‌అండ్‌ఆర్ డీన్ డాక్టరు ముప్పా లక్ష్మణరావు పర్యవేక్షణలో విద్యార్థులు రూపొందించిన నేచురల్ అండ్ మల్టీపర్పస్ సులభతర కోల్డ్ స్టోరేజి నమూనా అని వివరించారు. ఈ పరికరం తయారీపై పేటెంట్‌సాధించినట్లు డాక్టరు లక్ష్మణరావు తెలిపారు. లక్ష్మణ రావును, డిప్లమో కళాశాల ప్రిన్సిపాల్ వరపర్ల హరిబాబును, విద్యార్థులను కళాశాల టెక్నికల్ డైరక్టర్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ అభినందించారు.

మౌలిక వసతుల కల్పనకు రూ.57లక్షలు

● ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు రూ.57లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆస్పత్రిలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ తొలి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ, మున్సిపల్ కమిషనర్ అనూషలు పాల్గొన్నారు. బొగ్గవరపు నరసింహులు ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు గడ్డం మాలకొండయ్య శిగా తిరుపాలు, మువ్వల భూషయ్య, వంకాయలపాటి మీనాకుమారి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, డాక్టరు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

కావలి డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): జనసేన వీరమహిళ కొప్పుల లక్ష్మీదాతృత్వంతో శనివారం మునునూరులోని చంద్రబాబునగర్ కాలనీలోని పేదలకు శనివారం జనసేన నేతలు నిత్యావసరాలు, వంటసామగ్రి, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీరమహిళలతో పాటు జనసేన నియోజకవర్గ కో ఆర్డినేటర్ సుదీర్, బాలు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

కావలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఆర్యవైశ్యుడు గునుపూడి సత్యనారాయణ కుమార్తె వైద్యఖర్చుల నిమిత్తం శనివారం మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు తటవర్తి రమేష్ రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. నెల్లూరు నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలి వద్దకు వెళ్లి పరామర్శించారు. అవసరం అయితే మరో రూ.లక్ష అందజేస్తామని హామీ ఇచ్చారు.

నువ్వుల సాగుపై శిక్షణ

కందుకూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహారభద్రతా మిషన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం నువ్వులలో సమగ్ర పోషక యాజమాన్యం - అధిక దిగుబడులపై రైతులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. కేవీకే హెడ్ డాక్టరు జీ. ప్రసాద్‌బాబు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెంకటేష్, జ్యోతి, నిహారిక, శ్రీరంగ, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు పరామర్శ

బుచ్చిరెడ్డిపాళెం,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలువురు టీడీపీ నాయకుల కుటుంబాలను ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, మాజీ మ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు శనివారం పరామర్శించారు. ముందుగా నెల్లూరు చంద్రశేఖర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఆరోగ్యసమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన టీడీపీ మైనారిటీ నాయకుడు బచ్చాబాయ్(సమీవుల్లా) నివాసానికెళ్లి ఆయన కుమార్తె పర్వీనా, ఆమె సోదరిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఇటీవల పితృవియోగం చెందిన టీడీపీ నాయకుడు దొడ్ల కోదండరామిరెడ్డి, ఆయన సతీమణి, మాజీ ఎంపీపీ దొడ్ల విజయలక్ష్మిని పరామర్శించారు. వారివెంట బండ్ల కొండయ్య, సుధాకర్, డీ. వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లురెడ్డి, పలువురు మైనారిటీ నాయకులు తదితరులు ఉన్నారు.

కోవూరులో..

కోవూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్రంవీధిలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకుడు నిక్కుదల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను, శాంతినగర్‌కు చెందిన వేమిరెడ్డి రమణారెడ్డి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డిలు శనివారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలారవి, ముసలి సుధాకర్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ధ్యేయం

విడవలూరు,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జాబ్‌మేళాని ఏర్పాటు చేశారని టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, చెముకుల కృష్ణచైతన్య తెలిపారు. విడవలూరులోని ఎంపీపీ కార్యాలయ ఆవరణలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో సుమారు 110 మంది పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్‌కుమారి, నాయకులు ఎస్ సత్యంరెడ్డి, సీహెచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయ పాలకవర్గ ప్రమాణం

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు7: స్థానిక కాశీపాళెంలోని శ్రీ భద్రావతి భావనారుష్యేశ్వరస్వామి ఆలయానికి ఎన్నుకోబడిన పాలకవర్గం చైర్మన్, సభ్యులు శనివారం ప్రమాణస్వీకారం చేశారు. చైర్మన్‌గా మిట్టదొడ్ల సురేంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా పోలిశెట్టి నరసయ్య, గౌరవ అధ్యక్షుడిగా చేపూరు చలమయ్య, కార్యదర్శులుగా ఎం. సుధాకర్‌రావు, శ్రీహరి మల్లికార్జున వైస్‌చైర్మన్‌లుగా కే. కోటయ్య, మామిళ్ల మల్లికార్జున, కమిటీ సభ్యులు ప్రమాణం స్వీకారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామని తెలిపారు.

అమ్మవారి మహిమలు చెప్పనలవికావు

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): అశ్వత్థ మహామునిలాంటి వారికే కుష్ఠు వ్యాధి నుంచి శాప విమోచనం కలిగించిన కామాక్షితాయి మహిమలు చెప్పనలవికాదని చెన్నైకి చెందిన శ్రీదేవీ ఉపాసకులు మాయవరం రాఘవన్ అన్నారు. శనివారం ఆయన చెన్నై నుంచి కొంతమంది భక్తులతో జొన్నవాడకి వచ్చారు. ముందుగా స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మల్లికార్జున, కామాక్షితాయి అమ్మవారి పవిత్రను,ఆలయంలో నిద్రిస్తే కలిగే ఫలితాలను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనను సత్కరించారు.

తాగుబోతు ఉద్యోగితో వేధింపులు

పొదలకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాగుబోతు ఉద్యోగితో స్థానిక సీహెచ్‌సీ సిబ్బంది అవస్థలు పడుతున్నారు. నిత్యం మద్యం సేవించి విధులకు వచ్చే ఆ ఉద్యోగి తన మాటలు, చేష్టలతో నానారకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పలువురు సిబ్బంది ఆరోపిస్తున్నారు. నర్సులు డ్యూటీలు చేయాలన్నా ఆ ఉద్యోగి వల్ల భయమేస్తుందని అంటున్నారు. ఇటీవల ఓ హెడ్‌నర్స్‌ను ఆ ఉద్యోగి విసిగించడంతో పోలీసులకు తెలిపింది. పోలీసులు అతన్ని మందలించి, కౌన్సెలింగ్ ఇచ్చి పంపినా అతడిలో మార్పు రాలేదు. అధికారులకు ఈ విషయాన్ని పలుమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదు. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్‌ను వివరణ కోరగా అతడికి ఇప్పటికే మెమోలు ఇచ్చినట్లు, శనివారం తమ అధికారులపై సరెండర్ చేసినట్లు తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో వైభవంగా పడిపూజ

నెల్లూరు(సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి): నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం పడిపూజ కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా పాలాభిషేకం, గణపతి హోమం, ఉషపూజ, శ్రీవేలి ఉత్సవం, నవకాభిషేకం, ఉచ్ఛపూజ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, మహాదీపారాధన, భగవతిసేవ, పడికర్పూర హారతులు, హరిహరవాసంలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ జి.శేషగిరిరావు, కార్యదర్శి కేవీ రత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అట్టహాసంగా పడి పండుగ



కోవూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



వెంకటాచలం : మనబడి-మన భవిష్యత్తు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



బుచ్చి :రామచంద్రాపురంలో పాఠశాలలో కోలాటం ఆడుతున్న విద్యార్థినులు

● వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని పండుగ వాతావరణంలో జరిపారు. సర్వేపల్లి, నిడిగుంటపాళెం, కనుపూరు, పూడిపర్తి, చెముడుగుంట, వెంకటాచలం, ఇస్కపాళెం పాఠశాలలో సమావేశాలను ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

● స్కూళ్లలో రేపు అనేది లేకుండా చేశారు : సోమిరెడ్డి

గత వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాడు - నేడు పథకం పేరుతో విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడడంతో ప్రస్తుతం స్కూళ్లలో రేపు అనేది లేకుండా చేశారని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని సర్వేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మనబడి-మన భవిష్యత్తు కరపత్రాన్ని ఆవిష్కరించారు. పలు సమస్యలను తల్లిదండ్రులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతోగానో అకట్టుకున్నాయి. ఆటలపోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన, తహసీల్దార్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

● మనుబోలు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో శనివారం అట్టహాసంగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. తల్లిదండ్రులకు పలు ఆటలపోటీలు నిర్వహించారు. పిడూరుపాళెం ప్రాథమిక పాఠశాలలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి పిల్లలకు స్వీట్లు పంచిపెట్టారు. విజేతలైన తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. ఈ సమావేశాల్లో విద్యాకమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● సైదాపురం, (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం సందర్భంగా శనివారం మండలంలోని పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో డీఎల్‌డీవో వసుమతి, ఎంపీపీ పెంచలమ్మ, ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఏవో హైమావతి, సర్పంచులు,పాఠశాలల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

● తోటపల్లిగూడూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీపీ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో శనివారం మెగా పేరెంట్స్ మీటింగ్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గురుకుల డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ విజయలక్ష్మి, ఎంఈవో-2 డీ జయరామ నాయుడు, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఇస్తారమ్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో నరుకూరు ఎంపీటీసీ కే రఘుబాబు, హెచ్ఎంలు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

● పొదలకూరు, (ఆంధ్రజ్యోతి) : మండలవ్యాప్తంగా 103 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మెగా సమావేశాలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని డీఎస్ఆర్ జడ్పీ బాలరావు ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎంపీడీవో నరసింహారావు హాజరై మాట్లాడారు. తల్లులకు రంగోలి పోటీలు, వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, అతిథులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

● రాపూరు, (ఆంధ్రజ్యోతి): పిల్లల భవిష్యత్తుకు బంగారుబాట వేయాలని రాపూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి విజయకృష్ణ తెలిపారు. శనివారం ప్రభుత్వం చేపట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాపూరు ఎంపీపీ దందోలు వెంకటేశ్వర్లురెడ్డి,ఎంఈవో జీ. శ్రీనివాసులు, ఎంపీడీవో భవానీ, సర్పంచి భూపతి జయమ్మ, హెచ్ఎం. బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత ప్రమాణాలతో విద్యారంగాన్ని తీర్చిదిద్దుతాం : ప్రశాంతిరెడ్డి

కోవూరు (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖామంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యా రంగాన్ని ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం సమయాన్ని కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అనూష, ఎంపీపీ పార్వతి, తహసీల్దారు నిత్యానందబాబు, ఎంపీడీవో శ్రీహరి రెడ్డి, ఎంఈవో రహీమ్, కోవూరు, లేగుంటపాడు సర్పంచులు విజయమ్మ, జెట్టి రాజగోపాలరెడ్డి, టీడీపీ నాయకులు చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి, ఇంతా మల్లారెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఇందుకూరుపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగపట్నం ఎంఈఆర్ హైస్కూల్‌లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మెగా (పీటీఎం) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మైక్రో డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా పాఠశాల ప్రాంగణంలో ఆటలు ఆడాలని తెలిపారు. అనంతరం మనబడి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేంద్రబాబు, ఎస్ఐ నాగార్జునరెడ్డి, హైస్కూల్ హెచ్ఎం నాగేశ్వరరావు, ఎంఈవో సునీల్, సర్పంచి తాతా సురేంద్ర, పీఈటీ ముజీర్ పాల్గొన్నారు.

● విడవలూరు, (ఆంధ్రజ్యోతి): విడవలూరు,ఊటుకూరు, ముదివర్తిలోని జడ్పీ ఉన్నత పాఠశాల్లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశాలను నిర్వహించారు. విడవలూరు హైస్కూల్‌లో విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, సత్యంరెడ్డి, చెముకుల శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం బహుమతులు అందజేశారు. ముదివర్తిలో టీడీపీ నాయకులు ఎస్‌కే.రఫీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కరీముల్లా, వైస్ చైర్మన్ గుమ్మడి లక్ష్మీస రేజ, ఉపసర్పంచు శరత్‌చంద్ర పాల్గొన్నారు. ఊటుకూరులో జరిగిన సమావేశంలో హెచ్ఎం ఎస్ఎస్ఎస్ కుమార్, సర్పంచు శేషమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ సుబ్బారావు పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూలు, బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, పెనుబల్లి, మినగల్లు, రేబాల, దామరమడుగు హైస్కూళ్లతోపాటు మండలంలో మొత్తం 69 పాఠశాలల్లో శనివారం పేరెంట్స్ టీచర్స్ మెగా సమావేశాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మెప్మా పీడీ రాధమ్మ, అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వల్లి, తహసీల్దారు వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీవో శ్రీహరి, ఎంఈవోలు దిలీప్‌కుమార్, పీవీ. రత్నం పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులకు ఆటలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. రామచంద్రాపురం గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థిని సంజనా రూపొందించిన ఎగ్జిబిట్ పలువురి ఆకర్షించింది. రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రదర్శించిన కోలాటం కూడా అలరించింది. ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలని పశు సంవర్ధకశాఖ ఉపసంచాలకులు శ్రీనివాసరావు తెలిపారు. ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. 71 పాఠశాలల్లో పీటీఎంలు నిర్వహించామని ఎంఈవో హేమసుందర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగమణి, సీఐ రవినాయక్, టీడీపీ నాయకులు నీలం మల్లికార్జునయాదవ్, అబ్దుల్ షఫీవుల్లా, ఏడుకొండలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో ప్రజల సమస్యల పరిష్కారం

● రాపూరు తహసీల్దారు పీ. లక్ష్మీనరసింహం



రాపూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను పరిశీలించి మా పరిధిలో ఉన్న వాటిని పరిష్కరిస్తామని రాపూరు తహసీల్దారు పి లక్ష్మీనరసింహం తెలిపారు. జనవరి 8 వరకు గ్రామాల్లో వచ్చే అర్జీలకు పరిష్కారం చూపుతామన్నారు.

? : సదస్సులతో రైతు సమస్యలు పరిష్కారమవుతాయా.

! : మా పరిధిలో చేయగలిగినవిగా ఉంటే తప్పకుండా పరిష్కారం చేస్తాం. ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో పరిష్కారమయ్యేవైతే సిఫార్సు చేస్తాం.

? : గ్రీవెన్స్‌లో ఎలాంటి సమస్యలు వచ్చాయి.

! : సాదా బైనామాలు, రీసర్వేలో తలెత్తిన సమస్యలు, బాట సమస్యలు, వారసత్వ భూములకు పాసుపుస్తకాలు, 1బీ అడంగళ్ సమస్యలపై అర్జీలు వచ్చాయి.

? : సచివాలయ పరిధిలో పరిష్కారం అవుతాయా.

! : అంతా ఆన్‌లైన్‌లో ద్వారానే. తహసీల్దారు కార్యాలయం నుంచే సమస్యలు పరిష్కారం.

? : రీసర్వేలో తలెత్తిన భూమి విస్తీర్ణంలో మార్పులు సరిచేస్తారా.

! : జాయింట్ ఎల్‌పీఎంలో సమస్యలుంటే వాళ్ల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, అనుభవం మేరకు భూమి సర్వే చేసి వ్యక్తిగత ఎల్‌పీఎం కల్పించి పరిష్కరిస్తాం.

మంత్రిని కలిసిన బులియన్ మర్చంట్స్

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్యవైశ్య బులియన్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ నాయకులు శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరి నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. బులియన్ మర్చంట్స్ వ్యాపారంలో ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి ఆ సమస్యలను పరిష్కరిస్తామని వ్యాపారులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు, కోశాధికారి భోగనాథం సుబ్రహ్మణ్యం, సభ్యులు టి.కిషోర్, చందాలు సతీష్, తులసి, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'షి' షార్ట్‌ఫిల్మ్‌కు రెండు అవార్డులు

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాదుకు చెందిన వి. వరల్డ్ టైగర్ అవార్డు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ తెలంగాణా రాష్ట్రాలకు షార్ట్‌ఫిల్మ్ కాంపిటేషన్ నిర్వహించింది. రెండు రాష్ట్రాల నుంచి 100 షార్ట్‌ఫిల్మ్ కాంపిటేషన్‌లో పాల్గొనగా, నెల్లూరుకు చెందిన కళాంజలి అనంత్ (కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం) వహించిన షి (ద పవర్) షార్ట్‌ఫిల్మ్‌కు ఉత్తమ జ్యూరీ అవార్డు, బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ అవార్డు సంగీత్ సౌరభ్‌కి దక్కాయి. ఈ షార్ట్ ఫిల్మ్‌లో రామచంద్రమూర్తి, దువ్వూరు బెనర్జీ, మౌనిక, ఉపేంద్ర, శివకుమార్, హజరత్ నటించగా క్రిస్టోఫర్ కెమెరామెన్‌గా వ్యవహరించారు.

ఇంజనీరింగ్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ మీట్

నెల్లూరు(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మెకానికల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఫేకల్టీ డెవలప్‌మెంట్ మీట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీ.దత్తాత్రేయశర్మ మాట్లాడుతూ ఇండస్ట్రీ 4.0 టాపిక్ మీద ఐదురోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రోబోటిక్, అప్లికేషన్స్, డ్రోన్స్ ఇండస్ట్రీ తదితర అంశాలపై చర్చించడంతో పాటు అధ్యాపకులు తమ విజ్ఞానాన్ని ఎలా పెంపొందించుకోవాలి, విద్యార్థులను ఉన్నతంగా ఎలా తీర్చిదిద్దాలన్న విషయాలపై శిక్షణ పొందుతారని తెలిపారు. అనంతరం తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్లు డాక్టర్ ఆర్.త్యాగరాజన్, డాక్టర్ గోవిందులు పలు అంశాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, కన్వీనర్ డాక్టర్ ఏవీఎస్.శ్రీధర్‌కుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ బీవీఆర్ఎం కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా!

● 'గడప గడప'లో గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించే బాధ్యత నాది అంటూ టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా శనివారం రామలింగాపురంలో ఇంటింటికి వెళ్లిన ఆయన స్థానికులతో మాట్లాడారు. రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పుడు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన వివరించారు.

మాలల మహాగర్జనకు తరలిరండి

● మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని నల్లపాడు రోడ్డులో ఈనెల 15వ తేదీ సాయంతం జరిగే మాలల మహాగర్జన కార్యక్రమానికి జిల్లా నుంచి భారీగా తరలిరావాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలల జేఏసీ ఆధ్వర్యంలో జరిగే ఈ గర్జనకు జిల్లా నలుమూలల నుంచి మాలలు వేలాదిగా తరలివచ్చి మాలల సత్తా ఏమిటో తెలియజేయాలన్నారు. ప్రతి గ్రామంలోని మాల పల్లెలో తిరిగి మాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో కొప్పాల ప్రమీల, పనబాక జయప్రద, మాలమహానాడు మహిళా నాయకురాలు ఉషారాణి, కొత్తకోట కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డబ్ల్యూ పీఆర్ఎస్‌లు బదిలీ


నెల్లూరు(సిటీ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని సచివాలయాల్లో పని చేస్తున్న వార్డు ప్లానింగ్ సెక్రటరీలను బదిలీ చేస్తూ కమిషనర్ సూర్యతేజ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నగర పరిధిలోని 166 సచివాలయాల్లోని సెక్రటరీలను వేర్వేరు సచివాలయాలకు బదిలీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న వారంత సోమవారం నుంచి విధుల్లో చేరాలని ఆదేశించారు. అలాగే సిటీ ప్లానింగ్‌లోని ఏసీపీ వేణు, టీపీవో ప్రకాష్‌బాబులకు డివిజన్లను కేటాయించారు. కార్పొరేషన్‌లో పని చేస్తున్న టైంస్కేల్ ఎన్ఎంఆర్ సిబ్బందిలో కొందరిని రెగ్యులర్ చేశారు.

10న డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఒకటవ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు ఈనెల 10వ తేదీ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యాక్రమం నిర్వహిస్తున్నామని డీఎం మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 9959225641కు ఫోన్ చేసి తమ సలహాలు, సూచనలు, ఫిర్యాదులు చేయాలని కోరారు.

కేన్సర్ బాధితురాలికి రూ.10వేల సాయం

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న టాక్సీ డ్రైవర్ కృష్ణయ్య భార్యకు వైద్య ఖర్చులకు సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్వర్‌బాషా శనివారం రూ. 10వేలు ఆర్థిక సాయం చేశారు. జర్నలిస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్వర్‌బాషా మాట్లాడుతూ తాము సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశామన్నారు. అందుబాటులో ఒక్క రూపాయి కార్యక్రమం ప్రారంభించామన్నారు. సాటి డ్రైవర్ల ఆర్థిక ఇబ్బందిలో ఉన్నట్లు తెలిస్తే ఆ విషయాన్ని తమ గ్రూప్ సభ్యులకు షేర్ చేస్తామని తెలిపారు. తమ అసోసియేషన్ సభ్యులు పంపిన మొత్తాన్ని బాధిత డ్రైవర్ కుటుంబానికి ఇస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో మైదుకూరుకు చెందిన డ్రైవర్ అసోసియేషన్ నాయకులు లింగమూర్తి, నెల్లూరుకు చెందిన షేక్.మెయిద్దీన్, నెల్లూరు డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



సంచార దంత వైద్య వాహనాన్ని ప్రారంభిస్తున్న విజయ భాస్కర్‌రెడ్డి

ప్రజల వద్దకు ఉచిత దంత వైద్య సేవ

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నారాయణ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవ అందిస్తున్నామని నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం నారాయణ దంత వైద్య కళాశాల ప్రాంగణంలో సంచార వాహనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సంచార దంత వైద్య వాహనంలో ప్రత్యేక డెంటల్ చైర్, డిజిటల్ ఎక్స్‌రే వంటి పరికరాల ద్వారా పిప్పిపళ్లను తొలగించటం, పంటికి సిమెంట్ పెట్టడం, చిన్నపాటి శస్త్రచికిత్సలు నిర్వహిస్తారన్నారు. 10 మంది స్పెషలిస్ట్ దంత వైద్యులు ఇందులో ఉంటారని వెల్లడించారు. నారాయణ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రెజినాల్డ్ మాట్లాడుతూ నెల్లూరు నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని 180 పాఠశాలల్లో విద్యార్థులకు దంత చికిత్సలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ శివకుమార్, డాక్టర్ సునీల్‌కుమార్, ఏజీఎం భాస్కర్‌రెడ్డి, ఏవో అరవిందొరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య ప్రభుత్వ లక్ష్యం : నుడా చైర్మన్



యాంటీడ్రగ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కోటంరెడ్డి దంపతులు, డీఎస్పీ తదితరులు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఏసీ నగర్ మల్లెల సంజీవయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చేందుకు విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారన్నారు. ఈ స్కూలంటే తనకెంతో ఇష్టమని, తన సతీమణి సంధ్య ఈ పాఠశాలను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నగర డీఎస్పీ శ్రీనివాసులరెడ్డితో కలిసి యాంటీ డ్రగ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఆటపాటల్లో విజేతలకు కోటంరెడ్డి సంధ్య బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ సీఐ సాంబశివరావు, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ మాధవి, వైస్ చైర్మన్ వెంకటరమణ, మల్లికార్జున, సుభాన్‌బాషా, ఆకుల హనుమంతరావు, గురుప్రసాద్, అరుణ్, ఆలీ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి : డీఎంహెచ్‌వో

ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య సూచించారు. శనివారం కొత్తూరులో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. మలవిసర్జన తర్వాత, భోజనానికి ముందు చేతులు సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఏడాదికి రెండు పర్యాయాలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతినగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడకంపై చైతన్యం

● పేరెంట్స్ మీటింగ్‌లో ఎస్పీ వినూత్న ప్రచారం

నెల్లూరురూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో భాగంగా మండలంలోని ధనలక్ష్మీపురం హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ కృష్ణకాంత్ డ్రగ్స్‌పై చైతన్యం కల్పించే ప్రయత్నం చేశారు. డ్రగ్స్ వద్దు బ్రో.. అంటూ విద్యార్థులతో నినాదాలు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకంపై చిన్నతనం నుంచే చైతన్యం అవసరమన్నారు. డ్రగ్స్ వాడకంతో అందమైన జీవితం బుగ్గిపాలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, సీఐ జీ వేణు, హెచ్ఎం గిరిధర్‌సింగ్, ఎస్సై లక్ష్మణరావు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్నీ ఉన్నత పాఠశాలలో పేరేంట్ మీటింగ్‌ల ఘనంగా జరిగాయి. కాగా

● ఔట్‌పోస్టు ఏర్పాటుకు చర్యలు

ధనలక్ష్మీపురంలో ఔట్ పోస్టు ఏర్పాటు చేయాలని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్ ఎస్పీకి వినతిపత్రం అందచేయగా స్పందించిన ఆయన త్వరలో ఔట్ పోస్టు ఏర్పాటుకు కార్యచరణ జరుగుతుందని తెలిపారు. ప్రజలకు శాంతిభద్రతలను మరింత దగ్గర చేసే క్రమంలో అవసరమైన చోట్ల ఔట్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు.

● 44వ డివిజన్‌లో...

నెల్లూరు(సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి): నగరంలోని 44వ డివిజన్‌లోని కేవీఆర్ పాఠశాలలో హెచ్ఎం ఆధ్వర్యంలో జరిగిన పేరెంట్స్ సమావేశంలో ముఖ్య అతిథిగా టీడీపీ వాణిజ్య విభాగం పార్లమెంటు అధ్యక్షుడు, 44వ డివిజన్ ఇన్‌చార్జ్ దర్శి హరికృష్ణ, నాయకులు ఏడుకొండలు, రియాజ్, యానాదిరెడ్డి, రమేష్‌బాబు, రమేష్‌నాయుడు, కొడవలూరు సుధాకర్, రాజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

● దర్గామిట్ట క్రాంతినగర్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన బడి పండుగకు ముఖ్య అతిథిగా దర్గామిట్ట పోలీస్‌స్టేషన్ సీఐ రోశయ్య పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులను ఇంటిలో తల్లిదండ్రులు, బడిలో ఉపాధ్యాయులు జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. విశ్రాంత సోషల్ వెల్ఫేర్ అధికారి షేక్.ఖాసిం పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్ వితరణ చేశారు. బాలభవన్ డైరెక్టర్ జి.సుభద్రాదేవి పాఠశాల మౌలిక వసతులకు తనవంతు సహకారం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కామాక్షమ్మ, ప్రధానోపాధ్యాయుడు కొమ్మల కృష్ణయ్య, విశ్రాంత లెక్చరర్, భారత సేవా ఫౌండేషన్ సభ్యులు కుట్టి కుసుమ కుమారి పాల్గొన్నారు.

రామన్నపాలెంలో ఆత్మీయ సమావేశం




సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, దాతలు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొడవలూరు మండలం రామన్నపాలెంలోని ఎంపీయూపీ స్కూల్‌లో శనివారం పండుగ వాతావరణంలో పేరెంట్స్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తల్లిదండ్రులకు వారి పిల్లల విద్యాప్రగతి ప్రగతి కార్డులు అందజేశారు. ఉపాధ్యాయినులు శ్రీలక్ష్మి, పి.కిరణ్మయి, సుజాత సహకారంతో నిర్వహించిన పోటీల్లో విద్యార్థుల తల్లులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందచేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే గౌస్‌బాషా, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.దయామణి, గ్రామ పెద్ద దయాకర్‌రెడ్డి, గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు పవనకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయుడు ఎస్‌కే ఫిరోజ్ పాల్గొన్నారు.

10న ఐక్య సింహపురి క్రిస్మస్ మహోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో ఈనెల 10వ తేదీ సింహపురి ఐక్య క్రిస్మస్ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎం.బర్నబాస్ తెలిపారు. శనివారం నగరంలోని స్థానిక వీఆర్సీ మైదానంలో క్రైస్తవ నాయకులతో కలిసి గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఏళ్లుగా సింహపురి ఐక్య క్రిస్మస్ మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది నిర్వహించే ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ సువార్తకులు బ్రదర్ అనిల్‌కుమార్ వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ నాయకులు డాక్టర్ యు. సురేంద్రబాబు, గడ్డం హనోక్, క్రాంతి, నెల్లూరు పాస్టర్స్ అసెంబ్లీ నాయకులు దాసు, రాఘవమోసెస్, ఎల్ ఎం.విజయకుమార్, బాబు, జోనా, శ్యామ్, భాస్కర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



షహనాస్‌తో పొదుపు సంఘాల మహిళలు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ ఎస్‌కే షహనాస్ అన్నారు. శనివారం డీఆర్ డీఏ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ పీడీ సూచ నలతో జిల్లా సమైక్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షహనాస్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ నడుం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో శారద, లీలావతి, కామాక్షి, కె.వెంకటేశ్వర్లు, డీజీఎం సూరిబాబు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మరియ, కార్యదర్శి మాధురి, పొదుపు సంఘాల నాయకురాళ్లు పాల్గొన్నారు.

SUNDAY SPECIAL



ఎస్వీ జూపార్క్ పులిరాజ్యం

కథనం - మంగళం, ఆంధ్రజ్యోతి

తిరుపతిలోని ఎస్వీ జూపార్క్ పెద్దపులులకు ఆవాసంగా మారుతోంది. అంతరించిపోతోందంటూ ప్రపంచమంతా ఆందోళన చెందుతున్న పెద్దపులుల సంతతి ఇక్కడ మాత్రం వృద్ధి చెందుతోంది. పెద్దపులుల్లోనూ తెల్లపులి తిరుపతి జూపార్క్ రారాజుగా వెలుగొందుతోంది. జూలో ఉన్న 14 పెద్దపులుల్లో 9 తెల్లపులులే కావడం విశేషం. రాజసపు నడకతో దర్పంగా అటూఇటూ తిరుగుతూ సందర్శకులను పులులు ఆకర్షిస్తున్నాయి.



ప్రత్యేక ఆకర్షణ బెంగాల్ టైగర్

పసుపు పచ్చటి శరీరంపై నల్లటి చారలతో.. చురుకైన చూపులతో నింపాదిగా నాదే ఈ రాజ్యం అన్నట్టుగా నడిచే బెంగాల్ టైగర్స్ ఎస్వీ జూపార్క్‌లో రెండు ఉన్నాయి. ఆడ పులి పేరు కమల (14), మగ పులి పేరు సింబ (6). ఆరు నెలల కిందట లక్నో నుంచి తీసుకొచ్చిన ఒక ఆడపులి చనిపోయింది. అలాగే నవంబరు 25న మధు అనే మగ పులి వృద్ధాప్యంతో చనిపోయింది.

ఆత్మకూరు పులి పిల్లల సందడి

తల్లిపులి నుంచి విడిపోయి ఉన్న నాలుగు పులి పిల్లలను కర్నూలు జిల్లా ఆత్మకూరు అటవీ ప్రాంతం నుంచి రెండేళ్ల క్రితం తిరుపతి ఎస్వీ జూపార్క్ తెచ్చారు. వీటిలో ఒకటి అనారోగ్యంతో చనిపోగా మిగిలిన మూడు ఆడ పులి పిల్లలు జూపార్కులో సురక్షితంగా ఉన్నాయి. వీటికి అనంత, హరిణి, విజయ అనే పేర్లు పెట్టారు. అల్లరి ఆటలతో ఇవి సందడిగా తిరుగుతున్నాయి. ప్రస్తుతం వీటి వయస్సు రెండు సంవత్సరాలు.

పూటకు ఆరు కిలోల మాంసం

అడవిలో అంటే వేటాడి కోరిన జంతువును పులి తింటుంది. జూపార్క్‌లో మాత్రం వాటి ఆరోగ్యాన్ని నిరంతరం ఒక డాక్టర్ పర్యవేక్షిస్తూ తగిన ఆహారం సూచిస్తారు. ఉదయం పూట అర లీటరు పాలు, రెండు గుడ్లు, రెండు కేజీల చికెన్ పెడతారు. సాయంత్రం పూట మాత్రం మగ పులికి 6 కిలోల మాంసం (బీఫ్), ఆడ పులికి 5 కిలోల మాంసం పెడతారు.

పెద్దపులిని దత్తత తీసుకోవచ్చు

అంతరించిపోతున్న పెద్ద పులులను కాపాడుకోకపోతే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ప్రపంచమంతా పిలుపునిస్తోంది. ఇందులో మనమూ భాగం కావచ్చు. పులిని దత్తత కూడా తీసుకోవచ్చు. పెద్దపులిని దత్తత తీసుకోవడం అంటే జూపార్క్‌లో వాటికి అయ్యే ఖర్చు భరించడం అన్నమాట. ఒక రోజుకు దత్తత తీసుకుంటే రూ.1,330, వారానికి రూ.9,310, నెలకు రూ.39,900, మూడు నెలలకు రూ.1,19,700, ఆరు నెలలకు రూ.2,39,400, సంవత్సరానికి రూ.4,85,450 చెల్లించాల్సి ఉంటుంది.

తెల్లపులులదే రాజ్యం

ఎస్వీ జూపార్కులో తెల్లపులుల సంతతి పెరుగుతోంది. గతంలో హైదరాబాదు జూ నుంచి ఒక ఆడ తెల్లపులిని, ఒక మగ తెల్ల పులిని ఇక్కడికి తీసుకువచ్చారు. 2018లో వీటికి ఐదు పిల్లలు పుట్టాయి. వీటిలో రెండు చనిపోయాయి. బుడిబుడి నడకలతో మూడు ఇక్కడే పెరిగాయి. వీటికి మళ్లీ నాలుగు పిల్లలు పుట్టి పెద్దవయ్యాయి. ప్రస్తుతం తిరుపతి జూపార్క్‌లో 9 తెల్లపులులున్నాయి. సమీరా, రాణి, కృష్ణ, దేవి, జగన్, దుర్గ, లక్ష్మి, దేవిక.. ఇలా వీటికి పేర్లున్నాయి.

ఉల్లాసంగా..ఉత్సాహంగా

- పండుగలా పేరెంట్-టీచర్స్ సమావేశాలు
- స్వచ్ఛందంగా పాల్గొన్న తల్లిదండ్రులు
- కన్నవారికి ప్రత్యేక పోటీలు...ప్రతిభ చాటిన పిల్లలకు ప్రశంసలు
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



శ్రీకాళహస్తి మండలం తొండమనాడు పాఠశాలలో టగ్ ఆఫ్ వార్ ఆడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్



తిరుపతి ఎస్‌జీఎస్ హైస్కూల్లో మహిళలకు ముగ్గుల పోటీలు

తిరుపతి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా శనివారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణంలో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు అట్టహాసంగా జరిగాయి. గతానికి భిన్నంగా తల్లిదండ్రులు ఉత్సాహంగా తరలి వచ్చారు. వారికి ఉపాధ్యాయులు ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ వంటివి, మగవారికి టగ్ ఆఫ్ వార్ వంటి పోటీలు జరిపి గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. గతేడాది టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ప్రస్తుతం చదువుతున్న పిల్లలకు సంబంధించి సమగ్ర వివరాలతో ప్రోగ్రెస్ రిపోర్టులను తల్లిదండ్రులకు అందజేశారు. ఏవైనా సబ్జెక్టులు, క్రీడలు తదితర అంశాల్లో వెనుకబడిన పిల్లల వివరాలు తల్లిదండ్రులకు తెలియజేసి ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిందిగా సూచించారు. ఆపై అంతా కలిసి విందు భోజనాలు చేశారు. అచ్చంగా కార్తీక వన భోజనాలను గుర్తుకు తెచ్చిన పేరెంట్స్-టీచర్స్ మెగా మీటింగులతో ప్రభుత్వ పాఠశాలలు సందడిగా మారాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల రాకతో స్కూళ్లకు అదనపు కళ వచ్చినట్టయింది.

అధికారులు, నేతల దృష్టికి సమస్యలు

మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగుల్లో పాల్గొన్న తల్లిదండ్రులు, విద్యార్థులు స్కూళ్లలో సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చారు. పుత్తూరు జడ్పీ బాలికోన్నత పాఠశాలకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సూర్యనారాయణ హాజరు కాగా స్కూల్లో మధ్యాహ్న భోజనం సరిగా లేదని కొందరు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా మరికొందరు పిల్లలకు ఇస్తున్న కోడిగుడ్డు సైజు చిన్నగా ఉంటోందని ఫిర్యాదు చేశారు. ఆ స్కూల్లో మధ్యాహ్న భోజనం సరిగా లేనందున పిల్లలకు తాను ఇంటి నుంచీ క్యారియర్ పంపిస్తున్నానని గోవిందస్వామి ఫిర్యాదు చేశారు. తడ మండలం ఖాసింగాడు కుప్పం ప్రాథమికోన్నత పాఠశాల సమావేశంలో హైస్కూలు ఏర్పాటు చేయాలని, అదనపు గదులు నిర్మించాలని తల్లిదండ్రులు కోరారు. తిరుపతి నగరం సత్యనారాయణపురం జడ్పీ హైస్కూల్ ప్లస్ విద్యాసంస్థలో సమావేశానికి శాప్ ఛైర్మన్ రవినాయుడు హాజరయ్యారు. ఇంటర్ విద్యార్థులకు బాటనీ, జువాలజీ పుస్తకాలు ఇవ్వలేదని ఓ ఇంటర్ విద్యార్థిని ఫిర్యాదు చేశారు.

తుమ్మలగుంట హైస్కూల్లో హంగామా..

తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట హైస్కూల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు.టపాకాయలు కాల్చి సందడిచేశారు. 2022-23, 2023-24 టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శ్రీకాళహస్తి మండలం తొండమనాడు జడ్పీ హైస్కూల్లో సమావేశానికి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డీఈవో కె.వెంకటనాగేంద్ర కుమార్ హాజరయ్యారు. రేణిగుంట జడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లలో సమావేశాలకు జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్ హాజరుకాగా దొరవారిసత్రం మండలం మావిళ్లపాటు మోడల్ స్కూల్ సమావేశానికి సూళ్లూరుపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి అనిల్ కుమార్ వచ్చారు. తిరుపతి ఎంజీఎం స్కూల్లో మున్సిపల్ కమిషనర్ మౌర్య, టీపీపీఎం స్కూల్లో తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ హాజరయ్యారు. తిరుపతి రూరల్ మండలం పద్మావతీపురం జడ్పీ హైస్కూలు సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, వెంకటగిరి జడ్పీ బాలికోన్నత పాఠశాల సమావేశంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నారాయణవనం జడ్పీ హైస్కూలు, పిచ్చాటూరు జడ్పీ హైస్కూలు సమావేశాల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. నాయుడుపేట ఎల్ఏ సాగరం జడ్పీ హైస్కూలు సమావేశానికి మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం హాజరు కాగా అక్కడే బాలికల,బాలుర గురుకులాల్లో జరిగిన సమావేశాలకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ హాజరయ్యారు. చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాల సమావేశంలో ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు. విద్యను మించిన ఆస్తి లేదని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలం పెద్దకన్నలి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీ ఇచ్చి మోసం చేశారు..

కోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిన్నెలపూడి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాల చేస్తామని గూడూరు మాజీ ఎమ్మెల్యే వరప్రసాదరావు హామీ ఇచ్చి మోసం చేశారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. శనివారం పాఠశాలలో హెచ్‌ఎం చెంగమ్మ ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గ్రామస్థుడు మస్తానయ్య మాట్లాడుతూ పాఠశాల నిర్మాణానికి దివంగత టీడీపీ నేత గండవరం రవీంద్రారెడ్డి ఉచితంగా స్థలం ఇచ్చారని, ప్రభుత్వ నిధులతో పాఠశాలను నిర్మించారన్నారు. 220 మంది విద్యార్థులు ఉండగా పాఠశాల స్థాయిని పెంచుతామని మాజీ ఎమ్మెల్యే మోసం చేశారని తెలిపారు. టీడీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి ఆయనకు సర్దిచెప్పారు.



మస్తానయ్యకు సర్దిచెబుతున్న టీడీపీ నేత సుష్మారెడ్డి

శభాష్.. మాధవి!

- ప్రభుత్వ బడిలో ఇద్దరు పిల్లల్ని చదివిస్తున్న గెజిటెడ్ అధికారి





ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు పిల్లలతో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ - పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఓ తల్లిగా హాజరైన అధికారి మాధవి

పుత్తూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడిలో పాఠాలు చెప్పే టీచర్లే తమ పిల్లల్ని ప్రయివేటు బడులకు పంపుతున్న రోజుల్లో తన పిల్లలిద్దరినీ ప్రభుత్వ బడిలోనే చదివిస్తున్నారు ఒక ప్రభుత్వ అధికారి. ఆమె పేరు మాధవి. పుత్తూరు రేంజ్ ఫారెస్ట్ అధికారి. పుత్తూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆమె కూతురు ఇంది రాప్రియదర్శిని మూడవ తరగతి, కుమారుడు అనిరుధ్ రెండవ తరగతి చదువుతున్నారు. శనివారం జరిగిన పేరెంట్స్ సమావేశానికి హాజరై తన పిల్లల చదువు తీరుతెన్నుల గురించి టీచర్లను అడిగి ఆమె తెలుసుకున్నారు. కేవలం పేదపిల్లల ఆశ్రయాలుగానే ప్రభుత్వ బడులు మారిపోయిన కాలంలో మీరు మాత్రం ఎలా ఇక్కడ చదివిస్తున్నారు? అని అడిగితే, ప్రభుత్వ ఉద్యోగినైన నేనే నా పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించక పోతే ఎలా? అని ఎదురు ప్రశ్నించారు. "బట్టీపెట్టించే చదువులు నా పిల్లలకు వద్దనుకున్నాను. ఆటుపోట్లను ఎదుర్కొని రాటుదేలేందుకు ప్రభుత్వ బడే మంచి చోటు. అర్హతగల టీచర్లు ఇక్కడ ఉంటారు." అని చెప్పారు.



మునక్కాయలు @ రూ.400

- మిగిలిన కూరగాయలూ రూ.60పైనే

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. శనివారం తిరుపతి ప్రియదర్శిని మార్కెట్లో కిలో మునక్కాయలు రూ.400 పలికాయి. మిగిలిన కూరగాయలు కిలో రూ.60కు పైగా పలికాయి. వర్షాల కారణంగా పంట దెబ్బతినడం, దిగుబడి తగ్గడం, వివాహాలు, అయ్యప్ప స్వాముల సీజన్, కార్తీక మాసం కావడంతో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో కేజీ కొనేవారు ఇప్పుడు అర్ధ కిలోతో సరిపెట్టుకుంటున్నారు. ఎర్రగడ్డలు కిలో రూ.70, టమోటాలు రూ.60, పందిరి చిక్కుడు రూ.80, బీన్స్ రూ.60, సొరకాయ రూ.70, వంకాయలు రూ.70, గోరుచిక్కుడు రూ.50, బీరకాయ రూ.60 పలుకుతున్నాయి. ఈ క్రమంలో మార్కెట్‌కు వెళ్లే వినియోగదారులు ధరలు చూసి ఉసూరుమంటూ తిరిగి వస్తున్నారు.

చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడును నియమిస్తూ అనంతపురం డీఐజీ షిమోషీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ ఎస్పీగా పనిచేస్తున్న మణికంఠ చందోలు శనివారం నుంచి ఐదు రోజుల పాటు సెలవులో వెళ్లారు. దీంతో తిరుపతి ఎస్పీని ఇన్‌చార్జిగా నియమించారు.

తింటే.. తాళ్వాయిపాడు వంకాయ తినాలి

పొడుగూ, పొట్టి, తెల్ల, పచ్చ.. అంటూ వంకాయల్లో ఎన్నిరకాలున్నా చారలున్న తాళ్వాయిపాడు వంకాయ రుచికి ఏదీ దీటురాదు. ఎలా వండినా కమ్మగా కరిగిపోయే ఈ వంకాయలకు అందుకే అంత డిమాండ్ ఉంది. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలో శ్రీకాళహస్తి-నాయుడుపేట జాతీయ రహదారి మీద ఉండే ఊరే తాళ్వాయిపాడు.



6

వైభవంగా పుష్పయాగం

శ్రీవారి దేవేరి పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. శనివారం అమ్మవారికి పుష్పయాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని శ్రీకృష్ణముఖ మండపంలో బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి 14 రకాల పుష్పాలు, పత్రాలతో అర్చకులు పుష్పయాగం నయనానందకరంగా నిర్వహించారు.



నేడు ఎన్ఎంఎంఎస్ పరీక్ష

- హాజరుకానున్న 2,553 మంది విద్యార్థులు

తిరుపతి(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ - ఎన్ఎంఎంఎస్) ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా 12 కేంద్రాల్లో నిర్వహించనున్న ఈ పరీక్షకు 2,553 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగనున్నాయి. ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల స్థాయి పిల్లల్లో ప్రతిభా నైపుణ్యాలు వెలికితీసి, వారికి మరింత ప్రోత్సాహాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2008లో జాతీయ ప్రతిభాన్వేషణ ఉపకార వేతన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఏటా నవంబరు లేదా డిసెంబరులో దేశవ్యాప్తంగా పరీక్ష నిర్వహిస్తోంది. 2024-25 సంవత్సరానికిగాను ఆదివారం ఈ పరీక్ష నిర్వహించనున్నారు. మూడుగంటల పాటు నిర్వహించే ఈ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. 90 చొప్పున 180 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ కె.వెంకట నాగేంద్రకుమార్ తెలిపారు. పరీక్ష సమయానికి గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రా



బాధితురాలు లావణ్య

నా 'టామీ'ని చంపేశారు!

- పెంపుడు కుక్కను హతమార్చారని పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'నేను ఎంతో ప్రేమగా పెంచుకుంటున్న కుక్క(టామీ)ను చంపేశారు.. నిందితులను కఠినంగా శిక్షించండి' అంటూ ఒక మహిళ తిరుపతి ఈస్ట్ పోలీసులను కోరింది. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు... తిరుపతి శంకర్‌కాలనీలో నివాసమున్న మాజీ వలంటీర్ లావణ్య కొన్నేళ్ళుగా కుక్కలను పెంచుతోంది. రెండు రోజుల క్రితం సొంత పని మీద బయటకు వెళుతూ స్కావెంజర్స్ కాలనీలో కాపురమున్న తన మామ ఆనందయ్య ఇంటి వద్ద వదలి వెళ్లింది. పక్కనే నివాసముంటున్న యువకులు సాయికుమార్, శివకుమార్, వారి బంధువులపై ఆ కుక్క దాడి చేసింది. ఈ క్రమంలో యువకులు ఇంటిలో నుంచి బయటకు వచ్చిన కుక్కను కత్తులు, రాళ్లతో కొట్టి చంపేశారు. విషయం తెలిసిన యజమాని వెంటనే ఈ ఘటనపై ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ప్రచార మాధ్యమాల్లో ఈ విషయం బయటకు పొక్కడంతో ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి కుక్కను హతమార్చిన నిందితులు సాయికుమార్, శివకుమార్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కుక్క కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ వెటర్నరీ కళాశాలకు తరలించారు. ఇదిలావుండగా, పోలీసులు ప్రవర్తించిన తీరు బాధితురాలిని ఆవేదనకు గురిచేసింది. 'మీ కుక్క(టామీ)ను చంపితే కేసు పెట్టడమేంటి.. అసలు దాని తల్లిదండ్రులెవరు.. పుట్టు పూర్వోత్తరాలేమిటో చెప్పండి' అని పోలీసులు వ్యంగ్యంగా ప్రశ్నించడంతో లావణ్య విస్తుపోయారు.

రెవెన్యూ సదస్సులకు 943 అర్జీలు

తిరుపతి కలెక్టరేట్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. రెండవ రోజు శనివారం జిల్లాలో జరిగిన రెవెన్యూ సదస్సులకు వివిధ సమస్యలతో కూడిన దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. తిరుపతి రెవెన్యూ డివిజన్లో 276, శ్రీకాళహస్తి 169, సూళ్లూరుపేట 226, గూడూరు 272 వెరసి మొత్తం 943 అర్జీలు వచ్చాయని, అందులో 11 సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించడం జరిగిందని, మిగిలిన 932అర్జీలను కాల పరిమితి లోపల సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు.





తిరులు విరిసె.. తనువు మురిసె!

వైభవంగా పద్మావతిదేవికి పుష్పార్చన

తిరుచానూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవేరి పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవ శోభ వెల్లివిరిసింది. అమ్మవారికి శనివారం పుష్పయాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఉత్సవమూర్తిని శ్రీకృష్ణ ముఖమండపంలో కొలువుదీర్చారు. కుంభ మండల ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ, యాగశాలలో హోమం నిర్వహించారు. అనంతరం నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయంలో ప్రాయశ్చిత హోమం, శాంతి హోమం, పూర్ణాహుతి జరిగింది. సాయంత్రం ఐదు గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని శ్రీకృష్ణముఖ మండపంలో బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి 14రకాల పుష్పాలు, పత్రాలతో పుష్పయాగం నయనానందకరంగా నిర్వహించారు.





ఎకరాకు రూ.2లక్షల ఆదాయం

తింటే.. తాళ్వాయిపాడు వంకాయ తినాలి


● దేశవిదేశాల్లో డిమాండ్ ● వందల ఎకరాల్లో సాగు

కథనం పెళ్లకూరు,ఆంధ్రజ్యోతి

'వంకాయ వంటి కూరయు.. పంకజముఖి సీతవంటి భామామణియున్..' అని ఒక పద్యం ప్రచారంలో ఉంది. కూరగాయలన్నింటిలో వంకాయకున్న ప్రత్యేకత అది. 'వంకాయతో వెయ్యిరకాలు' అని కూడా అంటారు. అంటే.. వెయ్యి రకాల వంటలు చేయదగిన కూరగాయ- వంకాయ అని. కాస్త అతిశయోక్తి ఉంటే ఉండవచ్చునుగానీ తెలుగునేల మీద వంకాయకు ఉన్న ప్రాధాన్యం అటువంటిది. పొడుగూ, పొట్టి, తెల్ల, పచ్చ.. అంటూ వంకాయల్లో ఎన్నిరకాలున్నా.. చారలున్న తాళ్వాయిపాడు వంకాయ రుచికి ఏదీ దీటు రాదు. ఎలా వండినా కమ్మగా కరిగిపోయే ఈ వంకాయలకు అందుకే అంత డిమాండ్ ఉంది. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలో శ్రీకాళహస్తి- నాయుడుపేట జాతీయరహదారి మీద ఉండే ఊరే తాళ్వాయిపాడు.



ముదురాకుపచ్చ చారలున్న లేతపచ్చ వంకాయలకు ప్రసిద్ధి తాళ్వాయిపాడు. ఈ గ్రామంలో వంద ఎకరాల్లో వంకాయ సాగు ఉండేది. జాతీయ రహదారి విస్తరణ, కొత్తగా వెలిసిన పరిశ్రమలకు భూములు పోవడం, ఉన్న భూములకు రియల్ ఎస్టేట్ విలువ పెరిగి బంగారంగా మారిపోవడంతో వంగసాగు 40 ఎకరాలకు తగ్గిపోయింది. ఊళ్లో సాగు తగ్గినా తాళ్వాయిపాడు వంకాయ సాగు అనేక సమీప గ్రామాలకు విస్తరించింది. తాళ్వాయిపాడులోని నర్సరీ నుంచి నారు తీసుకువెళ్లి వంగసాగు చేస్తున్నారు. చావలి, చెంబడిపాలెం, పెన్నేపల్లి, కానూరు, రోసనూరు, శిరసనంబేడు, నందిమాల, కానూరుబంగారం పేట, మోదుగులపాళెం, కప్పగుంట కండ్రిగ, చెన్నప్ప నాయుడుపేట, సూళ్లూరుపేట సమీపంలోని మన్నారుపోలూరు, ఆబాక, అగ్రహారం, గూడూరు సమీపంలోని ఇందూరు చెంబడిపాళెం, వెంటోడుల్లో దాదాపు 500 ఎకరాల్లో తాళ్వాయిపాడు వంకాయ సాగు చేస్తున్నారు. ఈ విత్తనాలు మార్కెట్‌లో లభించవు. రైతులే తమ పంటనుంచి సేకరించి నారుపోసుకుంటారు. ఈ వంగకున్న డిమాండ్‌ను గ్రహించిన తాళ్వాయిపాడు రైతు కట్టా బాలసుబ్రహ్మణ్యం నర్సరీలో పెద్ద ఎత్తున వంగ నారు పెంచి అమ్ముతున్నారు. బెంగళూరు, హోసూరు ప్రాంత రైతులు కూడా ఇక్కడి నుంచి వంగ నారు తీసుకువెళ్తున్నారు. విత్తనాలు నాటిన తర్వాత 30 రోజులకు వంగనారు సిద్ధమవుతుంది. దీనిని పొలంలో నాటుకోవాలి. 50 రోజులకు దిగుబడి మొదలవుతుంది. ఎకరాకు 70 నుంచి 80 వేలు ఖర్చవుతుంది. ఆరు నుంచి ఎనిమిది నెలల దాకా కాపు ఉంటుంది. మార్కెట్‌లో రేటు బావుంటే ఎకరాకు రెండు లక్షల దాకా ఆదాయం వస్తుంది.



స్వర్ణముఖి నీటి మహిమ

స్వాతంత్ర్యానికి పూర్వం నుంచీ తాళ్వాయిపాడులో వంగసాగు జరుగుతున్నట్టు చెబుతున్నారు. తాళ్వాయిపాడు వంకాయకు ఇంత కమ్మటి రుచికి కారణం స్వర్ణముఖి నదీతీరపు నేలలో పెరగడమేనని ఇక్కడి రైతులు చెబుతారు. ఇదే వంకాయ ఇతర ప్రాంతాల్లో పండినా, వాటికీ, ఈ ఊరిలో పండిన వంకాయకూ రుచిలో తేడా ఉంటుందంటారు. అందుకే ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలకు తాళ్వాయిపాడు వంకాయలు పంపుతుంటారు. ప్రముఖులు తమ బంధుమిత్రులకు కానుకగా తాళ్వాయిపాడు వంకాయలు పంపుతుండడాన్ని బట్టి దీని ప్రత్యేకను గ్రహించవచ్చు. బెంగళూరు, చెన్నై, తిరుపతి, నెల్లూరు బస్సుల్లో తాళ్వాయిపాడు వంకాయలు పంపేవారు. బస్తాలపై టీవీఎస్(తాళ్వాయిపాడు వంకాయల సర్వీస్) అని రాసేవారు. రవాణాలో సిబ్బంది, కూలీలు ఈ అక్షరాలున్న మూటలను ఎలా అంటే అలా పడేసేవారు కాదు.



నేదురుమల్లికి ప్రియమైన వంకాయ

ఉమ్మడి ఏపీ ఒకనాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి తరచూ తాళ్వాయిపాడు నుంచి హైదరాబాదుకు వంకాయలను తెప్పించుకునేవారు. ఢిల్లీ నుంచి వచ్చే నాయకులకు వీటితో వంటకాలు చేయించే పెట్టేవారు. ఆయన ఇచ్చే విందుల్లో తాళ్వాయిపాడు వంకాయలతో చేసిన కూరలను అతిథులు ఇష్టంగా తినేవారని చెబుతారు. ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కాలంలో తాళ్వాయిపాడు నుంచి వంగనారు విమానంలో తెప్పించుకుని తన పెరటిలో వేయడంతో పాటూ, ఢిల్లీలోని కొందరు నాయకులకూ ఇచ్చారు. తాళ్వాయిపాడు వంకాయ రుచి ఎరిగిన ఈప్రాంతవాసులు తమ స్నేహితులకు తరచూ ఈ వంకాయలను పంపుతుంటారంటే అతిశయోక్తి కాదు.



వంగకు డిమాండ్ ఎక్కువ

నాకున్న ఒకటిన్నర ఎకరా నేలలో 50 సెంట్లు వంగ సాగు చేస్తున్నా. మిగిలిన నేలలో ఆకు కూరలు, చిక్కుడు, బెండ వేశాను. అయితే వంగకున్న డిమాండ్ ఎప్పుడూ మిగిలిన వాటికి ఉండదు.

- మనుబోలు కార్తిక్, తాళ్వాయిపాడు.

సేంద్రియమే ఎక్కువ

రెండు ఎకరాల విస్తీర్ణంలో వంగనారు పెంచుతాను. మంచి డిమాండ్ ఉంది. నారుకీ, సాగుకీ కూడా 80శాతం సేంద్రియ పద్ధతినే అనుసరిస్తాం. వేప కషాయం, పేడ ఎరువులనే నేలలో కలియదున్ని నారు నాటుకుంటాం. ఈ పద్ధతి వల్ల చీడపీడలు తక్కువగానే ఆశిస్తాయి. అప్పటికీ పురుగు ఆశిస్తే ఇక తప్పనిసరి పరిస్థితుల్లో రసాయన మందులు పిచికారీ చేస్తుంటాం.

-కట్టా బాలసుబ్రహ్మణ్యం, నర్సరీ యజమాని, తాళ్వాయిపాడు.



మా కుటుంబానికి ఆసరా

ఎన్నో ఏళ్లుగా మేం వంగ సాగు చేస్తున్నాం. లాభదాయకమైన పంట ఇది. ఉద్యానశాఖ అధికారుల సూచనలు కూడా తీసుకుంటూ ఉంటాం. కోతలు మొదలయ్యాక రోజు మార్చి రోజు మార్కెట్‌కి కాయలు పంపుతాం. మా కుటుంబానికి పెద్ద ఆసరా వంగసాగు.

- హరిప్రియ, వంగరైతు



ఈ నంబర్ల నుంచి ఫోన్లు వస్తే లిఫ్ట్ చేయెద్దు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు, ఇంటర్నేషనల్ కాల్స్ వస్తే వెంటనే లిఫ్ట్ చేయకూడదని జిల్లా సైబర్ క్రైం పోలీసులు హెచ్చరించారు. ఏమరపాటుగా ఉంటే బ్యాంకు అకౌంట్లలో ఉండే డబ్బు కాజేస్తారని చెబుతున్నారు. తరచూ ప్లస్ 381 (సెర్బియా), ప్లస్ 255(టాంజానియా), ప్లస్ 563(లోవా) ప్లస్ 375(బెలారస్) వంటి కోడ్ నెంబర్లతో ఫోన్ రింగ్ అవుతుందని, వీటితో పాటు 94777455913, ప్లస్ 255901130460, ప్లస్ 56322553736, ప్లస్ 37052529259 తదితర నెంబర్ల నుంచి ఫోన్లు వస్తే లిఫ్ట్ చేయవద్దని సూచించారు. లిఫ్ట్ చేస్తే కేవలం మూడు సెకన్లలో ఫోన్‌లోని విలువైన సమాచారాన్ని కాజేసే అవకాశముందని వివరించారు. కాగా, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి, హ్యాష్ 90 లేకుంటే హ్యాష్ 09 నెంబర్లను ప్రెస్ చేయాలని కోరుతున్నారని, దాన్ని అంగీకరించవద్దని సూచించారు. పొరబాటున ఈ కోడ్‌లు ఎంటర్ చేస్తే యూజర్ సిమ్ కార్డు యాక్సెస్ కేటుగాళ్ల చేతికి వెళ్లే అవకాశముందని సైబర్ క్రైం సీఐ వినోద్ తెలిపారు.

సైబర్ వలలో ఆర్టీసీ ఉద్యోగి

● రూ.1.18 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని ఆర్టీసీ ఉద్యోగి సైబర్ వలకు చిక్కాడు. వారి మాటలకు మోసపోయి తనతో పాటు కుమార్తె అకౌంటులోని రూ.1.18లక్షలు పోగొట్టుకున్నాడు. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మీనగర్‌కు చెందిన సురేంద్రనాథరెడ్డి తిరుపతి ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్నాడు. గతనెల 26వ తేదీన టీవీ డిష్ యాక్టివేషన్ చేయడానికి ప్రయత్నించాడు. ఆన్‌లైన్ ద్వారా కస్టమర్ కేర్ నంబరుకు ఫోన్ చేశాడు. ఆ సమయంలో సైబర్ క్రైం మోసగాళ్లు వాట్సాప్ ద్వారా రస్ట్ డస్క్ రిమోట్ యాక్సెస్ యాప్‌ను ఫోన్ ద్వారా డౌన్‌లోడ్ చేయించారు. దీంతో సురేంద్రనాథరెడ్డి మొబైల్ ఫోన్ నంబరును మెల్లగా యాక్సెస్‌లోకి తీసుకున్నారు. అకౌంట్‌లో బ్యాలెన్సు చెక్ చేయమని చెప్పారు. బ్యాలెన్సు చూడగా కుమార్తె అకౌంటులో ఉన్న రూ.28,001లు, సురేంద్రనాథరెడ్డి అకౌంటులో ఉన్న రూ.90,300 మొత్తం రూ.1.18లక్షలు మాయమైపోయాయి. దీనిపై శనివారం తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించింది. రూ.2.97కోట్లు ఆదాయం లభించినట్టు శనివారం ఉదయం ప్రకటించింది.శుక్రవారం 75,782 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా,26,057మంది తలనీలాలు సమర్పించారు.

ఫిబ్రవరిలో 'ఉప్పు కప్పురంబు' విడుదల

● హీరో సుహాస్



తిరుమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కీర్తి సురేష్‌తో 'ఉప్పు కప్పురంబు' అనే చిత్రం షూటింగ్ జరుగుతోందని, ఫిబ్రవరిలో ఈ చిత్రం విడుదల కానుందని హీరో సుహాస్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం దర్శించుకున్న సుహాస్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తన 'కలర్ ఫొటో' చిత్ర దర్శకుడు సందీప్ వివాహం కోసం తిరుమలకు వచ్చి స్వామి ఆశీస్సులు పొందినట్టు తెలిపారు. చాలా రోజుల తర్వాత మంచి దర్శనం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. కాగా, ఆలయం ముందు సుహాస్‌ను చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. ఆయనతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

అడవి జంతువుల కోసం విద్యుత్ తీగలు

మూడు గేదెలు, ఒక ఆవు మృతి

పెళ్లకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అడవి జంతువుల కోసం తీసిన విద్యుత్ తీగలు తగిలి మూడు గేదెలు, ఒక ఆవు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు.. రోసనూరు రాజుపాలెం అరుందతి కాలనీకి చెందిన రవి తన రెండు గేదెలు, ఒక ఆవును గురువారం ఉదయం మేత కోసం అడవిలోకి తోలుకెళ్లి వదిలాడు. చీకటి పడ్డాక కూడా గేదెలు, ఆవు రాకపోవడంతో మరసటి రోజు వస్తాయని భావించాడు. శుక్రవారం సాయంత్రం పశువులను తోలుకురావడానికి



అడవికి వెళ్లగా ఎక్కడా కనిపించలేదు. గాలించగా సమీపంలోని మామిడి తోటలో మృతి చెంది కనిపించాయి. అక్కడి పరిసరాలను పరిశీలించగా అడవి జంతువుల వేట కోసం తీసిన విద్యుత్ తీగలు కనిపించాయి. పశువులకు విద్యుత్ తీగలు తగిలి కాలిన గాయాలు ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. శనివారం ఉదయం ఎస్‌ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మామిడి తోటను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, మామిడి తోట యజమాని చెన్నైలో నివాసం ఉండడంతో స్థానికులు ఎవరో అడవి జంతువుల వేట కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ఉంటారని అనుమానిస్తున్నారు.

రెచ్చిపోయిన తాగుబోతులు

● మద్యం మత్తులో ప్రైవేటు ఇంజనీర్‌పై దాడి

● ముక్కంటి ఆలయ ఉద్యోగికి దేహశుద్ధి

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ ఒప్పంద ఉద్యోగి ఒకరు కొందరు తాగుబోతు మిత్రులతో కలిసి రెచ్చిపోయాడు. అకారణంగా రోడ్డు పక్కన నిలబడి ఉన్న ఓ ప్రైవేటు ఇంజనీర్‌పై దాడి చేశాడు. ఈ ఘటనను చూసిన కొందరు స్థానికులు ఆలయ ఉద్యోగిని చితకబాదారు. శ్రీకాళహస్తికి చెందిన వినోద్ చౌదరి అనే యువకుడు రేణిగుంటలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో ఇంజనీర్‌గా పనిచేస్తుంటాడు. శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తిలోని శ్రీరామ్‌నగర్‌కాలనీ తిరుపతి ప్రధాన రహదారి పక్కన ఉన్న తన అత్తగారి ఇంటి వద్దకు వెళ్లాడు. అక్కడ నిలుచుని భార్యతో మాట్లాడుతూ ఉన్నాడు. కడప ప్రాంతానికి చెందిన భాస్కర్‌రెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఒప్పందఉద్యోగిగా పనిచేస్తుంటాడు. ప్రస్తుతం ఆయన భక్తకన్నప్ప సదన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తికి చెందిన ముగ్గురితో పాటు ఊరందూరు గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి ఫూటుగా మద్యం సేవించాడు. ఈ నలుగురు శ్రీరామ్‌నగర్ కాలనీ వద్ద వెళుతూ వినోద్ ఉన్న నిలబడి ఉన్న చోట ఆగారు. తమను చూసి ఏదో మాట్లాడుకుని నవ్వుతున్నారని దంపతులపైకి దురుసుగా దూసుకెళ్లారు. తాము కుటుంబ విషయాలు మాట్లాడుకుంటున్నామని వారిస్తున్నప్పటికీ భాస్కర్‌రెడ్డి చెప్పును చేతిలోకి తీసుకుని వీరంగం చేశాడు. అతనితోపాటు ఉన్న మరో ఇద్దరితో కలిసి దాడికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న అత్త, భార్య తాగుబోతులను అడ్డుకున్నా వారు బూతులతో మరింత దాడికి పాల్పడ్డారు. భాస్కర్‌రెడ్డితో పాటు ఉన్న పళని అనే యువకుడు తాను పోలీసు అధికారులకు ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తుంటానని బెదిరింపులకు దిగాడు. కొందరు స్థానికులు గొడవను కట్టడిచేసేందుకు చొరవ తీసుకుని ఆలయ ఉద్యోగి అయిన భాస్కర్‌రెడ్డిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఆయన మాట వినకపోవడంతో చితకబాదారు. వినోద్ ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి వెంటనే భాస్కర్‌రెడ్డిని అతడి స్నేహితులను స్టేషన్‌కు పిలిపించి మందలించారు. మరోసారి ఇలా జరిగితే రౌడీషీట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్ని మాపక సిబ్బంది



తిరుమలలో కారు దగ్ధం

● ప్రయాణికులు సురక్షితం

తిరుమల, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం రాత్రి ఓ కారు దగ్ధమైంది. కారులో ప్రయాణించిన భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. బెంగళూరు వైట్‌ఫీల్డ్‌కు చెందిన భరత్ నలుగురు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తన కారులో శనివారం రాత్రి తిరుమలకు చేరుకున్నాడు. గది ఎలా పొందాలనే సమాచారం తెలుసుకునేందుకు బాలాజీ ఆర్టీసీ బస్టాండ్ వద్ద కారును ఆపారు. ఈ క్రమంలోనే కారు ఇంజిన్ నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన భరత్ కుటుంబ సభ్యులను, లగేజీని కారు నుంచి దింపేశాడు. ఏమైందో గుర్తించేలోపే కారు నుంచి నెమ్మదిగా మంటలు రావడం మొదలైంది. సమీపంలోని భద్రతా సిబ్బంది ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. ఈలోగా కారు నుంచి భారీగా మంటలు ఎగసిపడ్డాయి. అదే సమయంలో అక్కడున్న భక్తులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. ఘటనా ప్రాంతానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● విభిన్న ప్రతిభావంతులకు డీఆర్వో నరసింహులు పిలుపు

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు వెళ్లాలని డీఆర్వో నరసింహులు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ఇతరుల మీద ఆధారపడకుండా స్వయం కృషితో జీవించాలనే ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. జిల్లా యంత్రాంగం తరపున విభిన్న ప్రతిభావంతులకు అన్ని సదుపాయాలను అందిస్తున్నట్టు చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ నాయకులు మాధవ, మురళి, సుబ్రహ్మణ్యం, రెడ్డెప్ప, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యంరెడ్డి, పద్మజ, విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షార్‌లో 5కే రన్

సూళ్లూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో శనివారం ఇంటెగ్రిటీ 5కే రన్ నిర్వహించారు. దేశ శ్రేయస్సు, సంస్కృతి, సమగ్రత అనే నినాదంతో నిర్వహించిన 5కే రన్‌ను షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ప్రారంభించారు. షార్‌లోని మిషన్ కంట్రోల్ సెంటర్ వద్దనున్న సతీష్ ధావన్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన 5కే రన్ అంతరిక్ష కేంద్రీయ పాఠశాల వరకు సాగింది. 5కే రన్‌లో షార్ ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విజేతలకు అంతరిక్ష కేంద్రీయ పాఠశాల మైదానంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోల్ శ్రీనివాసులురెడ్డి, గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ, శంకరన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీసిటీలో ఈప్యాక్ పరిశ్రమ విస్తరణకు భూమిపూజ



వరదయ్యపాళెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఈప్యాక్ డ్యూరబుల్ లిమిటెడ్ పరిశ్రమ, తమ అధునాతన ఉత్పత్తి కేంద్రానికి శనివారం భూమిపూజ చేపట్టింది. పరిశ్రమ ఎండీ, సీఈవో అజయ్ సింఘానియా మాట్లాడుతూ ఈప్యాక్ ప్రయాణంలో ఇదో మైలురాయి అన్నారు. మేక్ ఇన్ ఇండియా చొరవకు అనుగుణంగా దేశీయ తయారీని ప్రోత్సహించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీకి ఇది మరో ముందడుగు అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎల్‌బి బోత్రా, హైసెన్స్ ఇండియా సీఈవో పంకజ్ రాణా, ఎండీ స్టీవెన్ లీ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పంచాయతీల అభివృద్ధి

- సర్పంచులతో ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలానికి చెందిన పలువురు సర్పంచ్‌లు శనివారం ఉదయం ఎమ్మెల్యే పులివర్తి నానీని ఇంటివద్ద కలిశారు. పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో ఎమ్మెల్యేని సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా పంచాయతీలను అభివృద్ధి చేసుకుందామని, ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లింగేశ్వరనగర్, సాయినగర్, కేసీపేట, అవిలాల, బ్రాహ్మణపట్టు, పద్మావతిపురం సర్పంచ్‌లు, టీడీపీ రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి, కూటమి పార్టీ నేతలు గణపతినాయుడు, సునీల్‌చౌదరి, అమిలినేని మధు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నానీతో సర్పంచ్‌లు

గంటల్లోనే చెవిరెడ్డితో భేటీ

శనివారం ఉదయం ఎమ్మెల్యే నానీని కలిసిన సర్పంచ్‌లు మధ్యాహ్నం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో భేటీ అయ్యారు. పంచాయతీల్లో నిధులున్నా , రూ.50వేలకన్నా ఎక్కువ అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే లేదా ఎంపీడీవో అనుమతి తీసుకునేలా ఆదేశించడంతో పల్లెల్లో పనులు పూర్తిచేయలేకపోతున్నామని,కార్యదర్శులు కూడా తమకు సహకరించడంలేదని చెప్పుకొచ్చారు.అభివృద్ధి పనులకు సహకరించని అధికారులను ప్రజలముందు దోషులుగా నిలబెడదామని చెవిరెడ్డి వారితో చెప్పారు.ఉదయం ఎమ్మెల్యేని కలసి సన్మానించిన సర్పంచులు గంటల వ్యవధిలోనే మాజీ ఎమ్మెల్యే ఇంటికి వచ్చి విమర్శలు చేయడం వెనుక ఆంతర్యమేమిటన్న చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తోంది.

కార్పొరేట్ విద్యను పేదలకు చేరువ చేయడమే లక్ష్యం: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యను నిరుపేదలకు చేరువ చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ప్రతిభావంతులుగా మెలగేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ప్రసాద్, ఎంఈవో వెంకటేశ్వరావు, విశ్రాంతి డీఎంహెచ్‌వో కోటేవ్వరమ్మ, న్యాయవాది గిరిజాకుమారి, పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణ, సీఐ రమణ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణముఖినదిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య



రావమ్మ (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రావమ్మ (65) అనే వృద్ధురాలు శుక్రవారం స్వర్ణముఖి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.... పట్టణంలోని తుమ్మూరుకు చెందిన రావమ్మ తన ఏకైక కుమార్తెను అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడికి ఇచ్చి వివాహం చేసింది. ప్రస్తుతం కుమార్తె వద్దే ఉంటున్న రావమ్మ శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి స్వర్ణముఖినది వద్దకు చేరుకుంది. సాయంత్రం వరకు అక్కడ మౌనంగా కూర్చొని ఉండగా ఓ యువకుడు గమనించి పలకరించాడు. అవ్వా ఏ ఊరు మీది, ఏదో ఆలోచిస్తున్నట్లు ఉన్నావు అని మాట కలిపినా రావమ్మ జవాబు ఇవ్వకుండా మౌనంగా ఉండిపోయింది. దీంతో ఆ యువకుడికి అనుమానం వచ్చి కొంచెం దూరంగా వెళ్లి కూర్చొని గమనించసాగాడు. చీకటి పడ్డాక రావమ్మ అకస్మాత్తుగా స్వర్ణముఖి కాజ్‌వేపై నుంచి నదిలో దూకేసింది. ఆ యువకుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చీకటి పడేవరకు గాలించినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టి స్వర్ణముఖినది కాజ్‌వే సమీపంలో రావమ్మ మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. వృద్ధురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తక్కువ సాగు ఖర్చుతో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆత్మప్రాజెక్టు డైరెక్టర్ శివనారాయణ

నాయుడుపేట టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సాగు ఖర్చులు పెరిగిపోతున్న తరుణంలో అధిక దిగుబడుల సాధించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు నూతన అందివ్వాలని ఆత్మప్రాజెక్టు డైరెక్టర్ శివనారాయణ అన్నారు. శనివారం నాయుడుపేటలో గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట డివిజన్ల పరిధిలోని రైతు సేవాకేంద్రాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలను ఆశిస్తున్న చీడల నివారణకు రసాయనాలకు బదులుగా ప్రత్యామ్నాయ పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అంతర, మిశ్రమ పంటల సాగుకు రైతులను సమయాత్తం చేయడంతో పాటు సాగులో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట ఏడీఏ ప్రసాద్, మండల వ్యవసాయశాఖ అధికారి గణేష్, వాకాడు, దొరవారిసత్రం ఏవోలు దీప, జోతిర్మయి, వ్యవసాయశాఖ అధికారులు వేణుగోపాలరావు, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాకాడులో న్యాయవిజ్ఞాన సదస్సు



న్యాయసదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్

వాకాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకాడు బీసీ కాలనీలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి భరత్ కమల్ మాట్లాడుతూ న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమత లేని కక్షిదారులు వినతి పత్రం ద్వారా తమను సంప్రదిస్తే న్యాయవాదిని నియమిస్తామన్నారు. సైబర్ మోసాల వల్ల ఎవరైనా అకౌంట్‌ల నుంచి డబ్బులు పోతే 1930 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగబాబు, లాయర్ వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేద్దాం

డక్కిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులు బాటలు వేయాలని ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం డక్కిలి మండలంలోని స్థానిక బాలయోగి బాలికల గురుకుల పాఠశాల, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తరుచూ ఇలాంటి సమావేశాలు నిర్వహించడం వల్ల విద్యార్థులు సరైన మార్గంలో నడవడం జరుగుతుందన్నారు. అంతేగాక తమ పిల్లల విద్యాప్రమాణలను తల్లిదండ్రులు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. తరగతి గదుల్లో వసతులు, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, భోజన సౌకర్యం గురించి తల్లిదండ్రులు తెలుసుకొన్నారు. మధ్యాహ్నం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ నాగమణి, వైస్ ప్రిన్సిపాల్ ప్రభావతి, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, జగదీష్ బాబు, విద్యా కమిటీ ఛైర్మన్లు దందవోలు వెంకటరమణారెడ్డి, సర్వేపల్లి రత్నయ్య, నాయకులు డక్కిలి చంద్రారెడ్డి, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో అధిక ఆదాయం

గూడూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగుతో రైతులు అధిక ఆదాయం సాధించవచ్చునని జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చెన్నూరు గ్రామంలో సాగులో ఉన్న పామాయిల్ తోటలను పరిశీలించి రైతులకు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామాయిల్‌ను సాగుచేపట్టే రైతులకు మొక్కలను ప్రభుత్వం ఉచితంగా అందజేసేలా చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో కార్తీక్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

కోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని గమళ్లపాళెం గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి సాయి అంజలికి ఉత్తర కొరియాకు చెందిన కోట కళ్యాణ్‌రామ్ రూ.22వేలు అందజేశారు. సాయి అంజలి బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. చదువుల్లోనూ, ఆటల్లోనూ ప్రతిభా చూపుతోంది. ఆ విద్యార్థిని కళాశాల ఫీజు చెల్లించేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో మాజీ సర్పంచు రాఘవయ్యను ఆశ్రయించగా ఆయన చొరవతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కళ్యాణ్‌రామ్ 22 వేలు అందజేశారు. ఆ నగదును మాజీ సర్పంచు రాఘవయ్య శనివారం సాయిఅంజలికి అందజేశారు.

డిగ్రీ కళాశాలలో బ్లడ్ గ్రూపు పరీక్షలు

గూడూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అధ్యాపకులు, విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, శ్రీనివాసులు, నారాయణరాజు, శ్రీధర్‌శర్మ, విజయమహేష్, మీనాక్షి, గోపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

సూళ్లూరుపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను సదరన్ రైల్వే డీఆర్ఎం విశ్వనాథ్ ఏర్యా శనివారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం కచ్చేరవీధిలో రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం డీఈఎన్ రామ ప్రసాద్, సిగ్నల్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.



అండర్ బ్రిడ్జి ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఆర్ఎం, రైల్వే అధికారులు

విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దడం

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమష్టి బాధ్యత



వాకాడులో ఎస్ఏఎల్‌సీఈఎఫ్ ఉన్నత పాఠశాల సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

వాకాడు, చిట్టమూరు, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమష్టి బాధ్యత అని సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన అన్నారు. వాకాడు మండలంలోని ఎస్ఏఎల్‌సీ ఈఎఫ్ పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు తొలి గురువు తల్లిదండ్రులే అన్నారు. విద్యార్థులను ప్రతిరోజు బడికివెళ్లేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. విద్యార్థుల నడవడికలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు తాడులాగే పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● చిట్టమూరు జీఎం నాయుడు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి సబ్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బంగారు భవిష్యత్తు నిర్మించుకోవాలని సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడుతో కలిసి విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శలు ఇచ్చారు. తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుడు దారా వాసుకి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో క్రిష్ణయ్య, హెచ్ఎంలు భూపయ్య, మీనాకుమారి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ నారాయణ, భషీర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.22 కోట్లతో వసతి గృహాల అభివృద్ధి: విజయశ్రీ



బాలుర గురుకులంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

నాయుడుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో రూ.1.22 కోట్లతో వసతిగృహాలను అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. నాయుడుపేటలోని బాలికల, బాలుర, గురుకుల పాఠశాల, కళాశాలల్లో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో వసతిగృహాల్లో సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లగా వారు వెంటనే స్పందించి రూ.1.22 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల విద్యాభ్యాసం, పాఠశాలల్లో, వసతి గృహాల్లో వసతులు, భోజన సదుపాయాల గురించి తల్లిదండ్రులకు తెలుస్తాయన్నారు. వారి భాగస్వామ్యం వల్ల పాఠశాలలను మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శాంతి, ప్రిన్సిపాల్లు దాదాపీర్, రూత్ రమోలా, ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పార్థసారధి, నానాబాల సుబ్బారావు, కుబేరు మణి, వెంకటయ్య, సంచి కృష్ణయ్య, సిద్దయ్య నాయుడు, ధనంజయ, శేఖర్ పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఎస్ అనిల్‌కుమార్

దొరవారిసత్రం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలని సూళ్లూరుపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి అనిల్‌కుమార్ కోరారు. శనివారం మావిళ్ళపాడు మోడల్ స్కూల్‌లో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు మంచి విద్యాబుద్ధులు నేర్పుతారని, అయితే పిల్లలు వారు చేసే స్నేహం, ఉండే వాతావరణం వల్ల వారి నడవడికలో మార్పు వస్తుందన్నారు. ఆ మార్పును తల్లిదండ్రులు గుర్తించి పిల్లలను సక్రమైన మార్గంలో నడిపించాలని సూచించారు. టెక్నాలజీ వినియోగం అధికమైన నేపత్యంలో సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా స్నేహాల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే పలు చట్టాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుమలత, ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరులో మల్టీసూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు: పాశం



సిద్ధార్థ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం

గూడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరాలకు దీటుగా గూడూరు పట్టణంలోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సిద్ధార్థ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక నరసింగ రావుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన సిద్ధార్థ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన ప్రజలు సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సి ఉండడంతో ఇబ్బందులు పడేవారన్నారు. గూడూరు పట్టణంలో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించి అన్ని రకాల వ్యాధులకు వైద్యసేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన డాక్టర్ తలమంచి వినోద్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే పాశం అభినందించారు. డాక్టర్ వినోద్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీసుధ ఎంతో అనుభవం కలిగిన వైద్యులని, వీరి ఆధ్వర్యంలో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని గూడూరులో ప్రారంభించడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో తలమంచి సిద్దారెడ్డి, చదలవాడ హరిప్రసాద్, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి షమీమ్‌పర్వీన్ సుల్తానా నాబేగం

గూడూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని, దీనిని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏడవ అదనపు జిల్లా జడ్జీ షమీమ్‌పర్వీన్ సుల్తానా బేగం అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్షన్ 89 సీపీసీ ప్రకారం మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు అరవ పార్వతయ్య, కొండలరావు, వెంకటసుబ్బయ్య, సుమన్, వంశీ, వెంకటేశ్వర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అంబరాన్నంటిన అయ్యప్పస్వామి పూజోత్సవం





పడిమెట్ల మీద కొలువుదీరిన అయ్యప్పస్వామి - స్వామివారిని దర్శించుకుంటున్న నెలవల, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

నాయుడుపేట/టౌన్, డిసెంబరు 5: నాయుడుపేటలోని పార్కు ప్రాంగణంలో అయ్యప్పస్వామి జ్యోతి పూజోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ గణపతిహోమం నిర్వహించారు. శబరిమలై తరహాలో ఆలయ సెట్టింగ్ వేసి అయ్యప్పస్వామిని కొలువుదీర్చారు. 20 అడుగుల పొడవున 18 అయ్యప్ప పడిమెట్లు ఏర్పాటు చేసి కర్పూరాన్ని ఉంచారు. పడిమెట్లు వద్ద సేకరించిన వందలాది కేజీల కర్పూరగడ్డలను అఖండ కర్పూరజ్యోతికి సిద్ధం చేశారు. అనంతరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి అఖండజ్యోతిని ప్రజ్వలనం చేశారు. వందల కేజీల భారీ కర్పూరగడ్డలను ఒక్కసారిగా వెలిగించడంతో అఖండ కర్పూరజ్యోతి దేదీప్యమానంగా వెలిగింది. శబరిమలై తరహాలో భారీ సెట్టింగ్‌తో ఆలయాన్ని ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు పట్టణ ప్రజలేకాక పరిసర ప్రాంతాల భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం జనసంద్రమైంది. కార్యక్రమంలో అయ్యప్పస్వామి జ్యోతి పూజోత్సవ కమిటీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, అంకయ్య, మునిరాజ, సుబ్రమణి, జలంధర్, శ్రీనివాసులు, గాదిరెడ్డి గోపీ, టీడీపీ నాయకులు చంద్రారెడ్డి, విజయకుమార్ నాయుడు, కిషోర్‌బాబు, నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

గూడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దోమల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో గత రెండు వారాలుగా దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు విషజ్వరాల భారీనపడి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫాగింగ్ చేసి దోమలను నియంత్రించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, కాలేషా, చంద్రయ్య, జమాలుల్లా, మున్నా తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళతో అసభ్య ప్రవర్తన

ఇద్దరిపై కేసు నమోదు

పెళ్లకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గిరిజన మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాగరాజు తెలిపిన మేరకు వివరాలు.... శుక్రవారం సాయంత్రం చిల్లకూరు వడ్డిపాలెం గ్రామానికి చెందిన చంద్రయ్య, వెంకటేశ్వర్లు ఓ గిరిజన మహిళ ఇంటి వద్దకు వెళ్లి అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె కేకలు వేసింది. ఇరుగు పొరుగు వారు గుమికూడడంతో చంద్రయ్య, వెంకటేశ్వర్లు పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రోత్సాహంతోనే ఉత్తమపౌరులుగా విద్యార్థులు



సీఎస్ఎం పాఠశాలలో విద్యార్థినికి సమగ్ర ప్రగతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే విద్యార్థులు ఉత్తమపౌరులుగా ఎదుగుతారని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సీఎస్ఎం జడ్పీబాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం నూతన శకానికి నాందిపలికారన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం నెలకొల్పి విద్యార్థుల్లో పిల్లల విద్య శ్రద్ధ పెంపొందించే విధంగా కొత్తఒరవడిని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రమణకుమార్, డిప్యూటీ ఈవో సనత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సీఐ శేఖర్‌బాబు, హెచ్ఎం శ్రీనివాసులు, మాధవిలక్ష్మీ, భారతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల మెరుగుకే సమావేశాలు



పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి

చిల్లకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చదువుల్లో విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు దోహదపడుతాయని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి అన్నారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థులకు సమగ్ర ప్రగతిపత్రాలు అందజేసి, పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం ముగ్గులు, ఆటల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాటూరు కవిత, దిలీప్‌రెడ్డి, ప్రభాకర్, హెచ్ఎం జాన్‌పీటర్, కోదండరామయ్య, ఉపాధ్యాయులు చంద్రయ్య, శంకరయ్య, శ్రీనివాసులు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపట్టాలు మంజూరు చేయించండి



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు శరత్‌బాబు

తడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి అటవీ పోరంబోకు భూమిలో గృహాలు నిర్మించుకొని జీవిస్తున్నామని, ఆ ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని మాంబట్టు గ్రామస్తులు సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయిని వేడుకున్నారు. శనివారం మాంబట్టులో రెవెన్యూ సదస్సు జరిగింది. ఆర్డీవో కిరణ్మయి పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 600 మంది అటవీ పోరంబోకు భూముల్లో ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్నామని, ఆ స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. స్పందించిన ఆర్డీవో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు శరత్‌బాబు, సర్పంచు రమణయ్య, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, వేనాటి రాజారెడ్డి, సురేష్‌రెడ్డి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో దోమల మందు పిచికారీ

సూళ్లూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీలో దోమల నివారణకు తొలిసారిగా డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలో పలు ప్రాంతాల్లో నీరు నిల్వఉండడంతో దోమలకు ఆవాస కేంద్రాలకు మారాయి. దీని వల్ల విష జ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య నీరు నిల్వవున్న ప్రాంతాల్లో డ్రోన్ సాయంతో రసాయనాలు పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా ప్రారంభించారు. టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, నాయకులు పాముూరు మునస్వామి, నలజాం రాము, పార్థసారధి మీజూరు వెంకటేశ్వర్లురెడ్డి, బీజేపీ నాయకులు తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీపీ తంబిరెడ్డి తనూజా రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి హర్షనీయమన్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తామని ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తులసీజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని 101 పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు.

దుస్తులు, మంగళసూత్రం అందజేత

వాకాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాకాడు ప్రాంతానికి చెందిన నూతన నూతన వధూవరులు శ్రీనివాసులు, లక్ష్మీగాయత్రికి సీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరమణారెడ్డి, హైమావతమ్మ, లావణ్య, మధుకిరణ్‌రెడ్డి రూ.40వేల విలువచేసే మంగళసూత్రం, పసుపు కుంకుమ, బట్టలు అందజేశారు. సీతారామ ధార్మిక సేవా సంస్థ కార్యదర్శి కొడవలూరు హరీష్‌రెడ్డి, కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, శ్రీనివాస యుగంధర్, శ్రీనివాసచక్రవర్తి, కళ్యాణ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.